





# శ్రీ పద్మావతి పరిణయము

## శ్రీ పద్మావతి శ్రీనివాసుల దివ్య కళ్యాణ వైభవం



తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి

# శ్రీ పద్మావతి పరిణయము

(శ్రీ పద్మావతి శ్రీనివాసుల దివ్య కళ్యాణ వైభవం)

రచన

తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి
(T.V.R.K. Murthy, M.Tech)

శ్రీ
శ్రీ డిజైన్స్
**Vedic Business Consultants**
**www.shridesigns.net**
**www.lordofsevenhills.com**
**Phone : 040- 65885750.**
**హైదరాబాదు**
**2009**

**శ్రీ పద్మావతి పరిణయము**

**(శ్రీ పద్మావతి శ్రీనివాసుల దివ్య కళ్యాణ వైభవం)**

**తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి**

© సర్వహక్కులు రచయితవి.

ప్రథమ ముద్రణ
**2009**

వెల :
అమూల్యము

కాపీలకు

**"Viswapathi"**
**T.V.R.K. MURTHY, M.Tech**
Flat No. 202, Plot No. 32,
Srikar's Ravi Residency,
Beside Nalanda High School,
Near Motinagar 'X' Roads,
HYDERABAD - 500 018, India.
Ph : 040 - 65885750.
Cell : 98494 43752
Email : viswapathi@yahoo.com
vediclogos@yahoo.com

Designed & Printed at :
**SRI VASAVI GRAPHICS,**
1A, 1st Floor, Ameepet,
Hyderabad. 9989277178.

# నివేదన

వేంకటాద్రి సమంస్థానం బ్రహ్మాండే నాస్తి కించన
వేంకటేశ సమో దేవో నభూతో నభవిష్యతి

ఈ బ్రహ్మాండంలో వేంకటాద్రితో సమానమైన పవిత్ర ప్రదేశం మరొకటి లేదు, శ్రీనివాసునితో సమానమైన దేవుడు ఇంతకు ముందు కాలంలో లేడు, ఇకముందు ఎన్నడూ కూడా ఉండబోడు, సాక్షాత్తూ ఆ శ్రీమన్నారాయణుడే మనలందరిని  కలియుగ బాధల నుండి కాపాడి అనుగ్రహించడానికై తిరుమలలో శ్రీ వేంకటేశ్వరునిగా స్వయంవ్యక్త అర్చారూపంలో ఆవిర్భవించాడు. ఆ స్వామి అత్యంత కరుణామయుడు, నమ్మినవారికి కొంగు బంగారం, ఆపదమొక్కులవాడు. ఆ స్వామిని నమ్మినవారికి ఎటువంటి బాధలు ఉండవు. అత్యంత దయామయమూర్తి ఆ శ్రీనివాసుడు.

నా తల్లితండ్రులైన కీ॥శే॥ బ్రహ్మశ్రీ తిమ్మరాజు లక్ష్మీ నరసింహారావు గారు, తల్లి శ్రీమతి నాగరత్నాంబ గారలు శ్రీనివాసుని ఎన్నో విధాలుగా సేవించి తరించారు.  నా తల్లితండ్రులు ఇరువురికీ శ్రీనివాసునిపై అపార భక్తి.  చిన్నతనం నుంచీ మా తండ్రిగారు రోజూ ఉదయమే చదివే శ్రీ వేంకటేశ్వరస్వామివారి సుప్రభాతం నాలో శ్రీనివాసుని యెడల భక్తి భావాన్ని కలిగించింది.  అప్పట్నుంచి శ్రీనివాసుడే నాకు గురువు, దైవం, తల్లి, తండ్రి.  అతడే యజమాని కూడాను.

1983లో రీజనల్ ఇంజనీరింగ్ కాలేజి, వరంగల్ నుండి ఎం.టెక్. చదివిన నేను 1984 దాకా ఆల్విన్‌లోనూ, 1989 దాకా ఎం.వి.ఎస్.ఆర్. ఇంజనీరింగ్ కాలేజిలోనూ ఉద్యోగం చేశాను. 1983లో చి॥సౌ॥ రుక్మిణి వైదేహితో వివాహం. ముగ్గురు పిల్లలు, ఆనంది, ఆముక్త, ఆదిత్యలు.

1998 నుంచి బిజినెస్ సంస్థలకు వేదశాస్త్రాలు, జ్యోతిష్య శాస్త్రం ఆధారంగా పేర్లు నిర్ణయించటం, లోగోలు డిజైన్ చేయడంలో నిమగ్నమై ఉన్నాను.  ఇప్పటిదాకా నేను లోగోలు డిజైన్ చేసిన 2,500 పైగా సంస్థలు దేశ, విదేశాలలో ప్రముఖ స్థానంలో ఉన్నాయంటే అదంతా ఆ శ్రీనివాసుని అనుగ్రహం తప్ప మరొకటి కాదు.

ఆ శ్రీనివాసుని దయవలన ఇంతకుమునుపు నేను శ్రీ శ్రీనివాస మాహాత్మ్యము, శ్రీ వేంకటేశ్వర వ్రతకల్పము, శ్రీ వేంకటేశ్వర దర్శనము, అమృతసోపానము, భజే శ్రీనివాసమ్, Sri Srinivasa - Lord of Seven Hills, ఇప్పటి ఈ "శ్రీ పద్మావతి పరిణయము" అనే పుస్తకాలను రచించడం జరిగింది.  ఈ రచనలన్నీ ఆ అమృతమూర్తి శ్రీనివాసుని అనుగ్రహంతోనే సాధ్యపడింది.  వీటినన్నింటిని శ్రీవారి మహా ప్రసాదంగా భావిస్తున్నాను. కలం పట్టుకున్నది మాత్రమే నేను, అంతా ఆ స్వామి అనుగ్రహమే! ప్రతి అక్షరం శ్రీవారి ప్రేరణే!

శ్రీ పద్మావతి శ్రీనివాసుల కళ్యాణం జగత్‌కళ్యాణమే.  వారి కళ్యాణ విశేషాలను తలచుకుంటే మనస్సు పులకరిస్తుంది.  ఈ రచన సాగిస్తున్నప్పుడు నాకు ఎన్నో అద్భుత అనుభవాలు జరిగాయి.

ఈ 'శ్రీ పద్మావతి పరిణయము' పుస్తక రచన ప్రారంభించిన నెలరోజులకే మా జ్యేష్ఠ కుమార్తె చి॥సౌ॥ఆనంది వివాహము నిశ్చయమవటం స్వామి వారి లీల, అనుగ్రహమూ తప్ప మరొకటి కాదు. ఈ పుస్తకం చదివిన కన్యలందరికీ తప్పక వెంటనే శ్రీ స్వామివారి అనుగ్రహంతో వివాహం నిశ్చయమవుతుందని నా నమ్మకం.

నా ప్రతి రచనా సమయంలోనూ ఎన్నో విధాల సహకరిస్తున్న శ్రీమతి & శ్రీ ఎల్లాప్రగడ వేంకట రమణమూర్తి, శ్రీమతి & శ్రీ ఎల్లాప్రగడ వేంకట శ్రీనివాస మూర్తి మరియు శ్రీమతి & శ్రీ వై.బి.యస్.మూర్తి దంపతులకు ఎంతో కృతజ్ఞతలు. వారికి, వారి కుటుంబాలకు ఆ శ్రీ లక్ష్మీ శ్రీనివాసుల అనుగ్రహం ఎల్లప్పుడూ వుండాలని ప్రార్థిస్తున్నాను.

ఈ పుస్తకం రచిస్తున్నప్పుడు ఎందరో మహానుభావుల గ్రంథాలు, ఎంతగానో నాకు తోడ్పడ్డాయి. వారందరికీ పేరుపేరున నా నమస్కారాలు. అలాగే ఈ గ్రంథ రచన సాదాంతం నా సహధర్మచారిణి చి॥ల॥సౌ॥ శ్రీమతి వేంకట రుక్మిణీ వైదేహి, చిరంజీవులు ఆనంది, ఆముక్త, ఆదిత్య శ్రీనివాస్‌లు ఎంతో సహకరించారు. ఈ పుస్తకాన్ని, కవర్ చిత్రాలను ఎంతో అందంగా డి.టి.పి. చేసిన శ్రీ వాసవీ గ్రాఫిక్స్, శ్రీమతి & శ్రీ పి.జగదీష్‌కు శ్రీలక్ష్మీశ్రీనివాసుల అనుగ్రహం ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థిస్తున్నాను.

ఈ పుస్తక ప్రచురణలో ఎంతోమంది శ్రీవారి ప్రియ భక్తులు ఎన్నో విధాలుగా సహకరించారు. వీరికీ, వీరి కుటుంబ సభ్యులందరికి ఆ శ్రీనివాసుని అనుగ్రహం ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థిస్తున్నాను.

ఇంతటి మహా భాగ్యాన్ని ప్రసాదించిన ఆ శ్రీవారి సేవలోనే ఎల్లప్పుడూ గడుపుతానని, శ్రీ వేంకట తత్వాన్ని ప్రజలందరి హృదయాలకు చేరువగా తీసుకెళ్ళడమే నా జీవిత గమ్యమని ఆ స్వామివారికి విన్నవించుకుంటున్నాను.

సర్వేజనా సుఖినోభవంతు ః

శ్రియః కాంతాయ కళ్యాణ నిధయే నిధయేర్థినామ్

శ్రీ వేంకట నివాసాయ శ్రీనివాసాయ మంగళం

హైదరాబాద్. తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి

# ఈ పుస్తకం ఎలా చదవాలి

భగవంతుడికి సంబంధించిన ఏ పుస్తకమైనా చదవడానికి ఎటువంటి నియమ నిబంధనలు వుండవని నా విశ్వాసం. వయస్సుతోగానీ, కులంతో గానీ, ఏ నిమిత్తమూ లేదు. మనస్సు నిర్మలంగానూ, శరీరం శుభ్రంగానూ ఉంటేచాలు. ఎవరైనా, ఏరీతిలోనైనా, ఏరోజైనా, ఏప్రదేశంలోనైనా చదువుకొనవచ్చును. ఆ శ్రీమన్నారాయణుని గురించిన పుస్తకం చదవడానికి కావలసినది నిర్మల భక్తి తప్ప మరొకటి కాదు. ఎటువంటి కఠోర నిష్టలు, ఉపవాసాలు అవసరం లేదు.

ఇకపోతే భగవంతునికి సంబంధించిన స్తోత్రాలకు, పారాయణ గ్రంథాలకి కొన్ని కొన్ని ప్రత్యేక పర్వ దినాలలోను, వైకుంఠ ఏకాదశి లాంటి పవిత్ర దినాలలోనూ చదివితే తప్పకుండా ఫలితం రెట్టింపుగా ఉంటుంది. ఈ విషయంలో ఏమాత్రం సందేహం లేదు.

వివాహం ఆలస్యమవుతున్న కన్యలు గానీ, వారి కుటుంబ సభ్యులు ఎవరైనా గానీ ఏ శుక్రవారమునాడైనా మొదలుపెట్టి వారం రోజుల పాటు ఆ పుస్తకాన్ని పారాయణం చేస్తే వెంటనే తప్పక మంచి వరునితో వివాహము నిశ్చయము కాగలదు. వీలున్నవారు ఏ శుక్రవారమునాడైనను పుస్తకమును పూర్తిగా కూడా చదువ వచ్చును. శ్రావణ శుక్రవారములలో పుస్తకము పూర్తిగా పఠించిన స్త్రీలకు సర్వ సౌభాగ్యములు లభించగలవు. శ్రీ లక్ష్మీ శ్రీనివాసుని అనుగ్రహంతో ఆ కుటుంబ సభ్యులందరు సుఖ సంతోషాలతో వుండగలరు. అలాగే శ్రీ పద్మావతి శ్రీనివాసుల పరిణయదినమైన వైశాఖ శుద్ధ దశమినాడు ఈ పుస్తకమును పఠించినవారికి సర్వ సౌభాగ్యములూ, అష్టైశ్వర్యములూ లభించి, సంపూర్ణ ఆయుష్షుతో కలకాలం సంతోషముగా జీవింపగలరు.

దురదృష్టవశాత్తు భర్తను పోగొట్టుకొనిన స్త్రీలు చదివిన ఎడల మరు జన్మలన్నిటిలో నూరు సంవత్సరములు సర్వ సౌభాగ్యములతో సుమంగళీ మణులుగా వుండెదరు.

కుటుంబములలో ఎటువంటి శుభకార్యములు తలపెట్టినప్పుడైనా కుటుంబ సభ్యులలో ఎవరైనా ఈ పుస్తకాన్ని పఠించినచో ఆ శుభకార్యము నిర్విఘ్నముగా, శుభప్రదముగా జరుగగలదు. శనివారము నాడు పఠించినచో ఎటువంటి అనారోగ్యమైనా వెంటనే తొలగిపోగలదు. ఏకాదశి నాడు పఠించినవారికి ఎటువంటి ఆర్థిక, అనారోగ్య సమస్యలున్నా తొలగిపోయి, సంపూర్ణ ఆరోగ్యమూ, సకల సౌభాగ్యములు చేకూరి శుభప్రదముగా గడుచును.

ఈ పుస్తకం చదివేటప్పుడు ఎటువంటి కఠోర నియమ నిష్టలు అవసరం లేదు. మీరున్నచోటనే, మీకు వీలున్నట్లుగా కూర్చుని నిర్మల మనసుతో చదివితే చాలు. ప్రయాణంలో ఉన్నప్పుడు కూడా చదవవచ్చును. ఈ పుస్తకం సర్వవేళలా మీతోనే ఉంచుకుని మనస్సుకు ఎప్పుడు తోచితే అప్పుడు చదువుకొనవచ్చును.

ఈవిధంగా మీకు వీలున్న ఏ రోజైనా, ఏ రీతిలోనైనా చదివి శ్రీనివాసుని అనుగ్రహంతో సంపూర్ణ ఆరోగ్యంతో, సర్వ సంపదలతో కలకాలం సుఖముగా జీవించవచ్చును.

శ్రీ లక్ష్మీ శ్రీనివాస కటాక్ష సిద్ధిరస్తు !

– తిమ్మరాజు విశ్వపతిరామకృష్ణమూర్తి.

# శ్రీ పద్మావతి పరిణయము

వైకుంఠంలో శ్రీమన్నారాయణులవారు ఆదిశేషునిపై విశ్రమించి వుండగా జగన్మాత శ్రీ మహాలక్ష్మీదేవి స్వామివారి పాదాలు వత్తుతూ వున్నది. శ్రీ లక్ష్మీ నారాయణులను మనసులో తలచినంతనే ఆ దివ్య మనోహర మంగళ స్వరూప మూర్తులు మనస్సులో దర్శనమిస్తారు. ఆ దర్శనంతో మన శరీరమంతా పులకరిస్తుంది. ఆ దంపతుల అన్యోన్యత లోకానికే ఆదర్శం. ఈ సృష్టిలోని అందమంతా ఆ శ్రీ మహాలక్ష్మీ తల్లియందే కలదు. శేషునిపై కూర్చుని భర్తకు సపర్యలు చేస్తున్న ఆ ముగ్ధ మనోహర రూపిణి ఎంత దివ్యంగా వుందో చూడండి! సృష్టి మొత్తాన్ని తనలో నింపుకొని, ఆ సృష్టినంతటినీ పోషిస్తూ వారందరి హృదయాలలోనూ చిరునవ్వుతో వుండే ఆ పరబ్రహ్మమూర్తి శ్రీమన్నారాయణుడు తన ముద్దుల పట్టమహిషి వంక చిరునవ్వుతో చూస్తూ ఏవో కబుర్లు చెబుతున్నాడు. ఏమి విశేషం చెబుతున్నాడో కానీ ఆ తల్లి పెనివిటి వంక ఆశ్చర్యంగా చూస్తున్నది. ఇంతలోనే మళ్లీ ఏదో వేళాకోళం చేసినట్లున్నాడు! ఆ జగన్మాత సిగ్గుతో



ముడుచుకున్నది... ఆహా ఎంత దివ్యంగా వుంది ఆ మహాలక్ష్మి. ఆ తల్లి సిగ్గుపడితే ఈ ప్రకృతిలోని పుష్పాలన్నీ ముడుచుకున్నట్లు ప్రకృతి మొత్తానికి ఒక వింత శోభ చేకూరింది. ఇంతలో అక్కడికి నారదులవారు వచ్చారు. సర్వకాల సర్వావస్థల యందు తన నామస్మరణమే చేసే నారదులవారంటే స్వామికి ఎంతో అభిమానం, ఎంతో ప్రేమ.

“ఏం నారదా! ఏమిటి విశేషం అని నవ్వుతూ నారదుని పలకరించారు శ్రీ స్వామివారు. ఓ పరంధామా! నీకివే నా నమస్కారములు. నీకు తెలియని విశేషాలేముంటాయి స్వామీ. ఈ సకల చరాచర సృష్టి నీ కనుసన్నలయందే నడుస్తున్నది కదా! సకల జీవకోటి నీ స్వరూపమే కదా. నీకు తెలియనిది, నాకు తెలిసినది ఏముంటుంది స్వామీ. నీ దయవలన అన్ని లోకాలవారు ఎంతో సుఖప్రదంగా వున్నారు. ఒక్క భూలోకంలో మాత్రం పాపం ఎక్కువై జనులు పుణ్యకార్యాలు చెయ్యటం మరచిపోతున్నారు. ధర్మా ధర్మ విచక్షణ కోల్పోతున్నారు’ అని అన్నాడు. ఇది వింటున్న శ్రీమన్నారాయణులవారు కనులు మూసుకుని చిరునవ్వు నవ్వారు. ఆ నవ్వుకు అర్థం ఏమిటో నారదులవారికి అంతు పట్టలేదు. ఇంతలో శ్రీ మహాలక్ష్మీ కల్పించుకుని ‘ నారదా ! భూలోకవాసులు ఎందుకు ఇలా ప్రవరిస్తున్నారు? వారిలో భక్తి, విచక్షణా జ్ఞానం ఎందుకు పూర్తిగా సన్నగిల్లింది? ఎందుకు వారు సన్మార్గంలో నడవటం లేదు? అని ప్రశ్నించింది. ఏమో తల్లీ అన్నీ ఆ శ్రీమన్నారాయణునికే ఎరుక. కానీ ఒకటి మాత్రం నిజం. భూలోకంలో ప్రజలందరూ సంసార సాగరంలో కొట్టు మిట్టాడుతూ అనేక బాధలు పడుతున్నారు. వారి బాధలు తగ్గించి వారిని రక్షించమని మిమ్మల్ని వేడుకోవడానికే వచ్చాను’ అని నారదులవారు శ్రీ మహాలక్ష్మితో అన్నారు.

ఇలా కాసేపు కబుర్లు చెప్పుకున్న అనంతరం నారదుడు శ్రీ లక్ష్మీనారాయణులవద్ద శెలవు తీసుకుని లోకసంచారణార్థం సాగిపోయాడు. నారదుడు అలా వెళ్లాడో లేదో ఒక్కసారి వాతావరణమంతా గంభీరంగా మారింది. ఏదో అవాంతరం రానున్నట్టుగా అనిపిస్తున్నది. వైకుంఠంలో, అదీ లక్ష్మీనారాయణుల చెంత అవాంతరమా?

ఇంతలో రుస రుసలాడుతూ కోపంతో ఊగిపోతూ బృగుమహర్షి అక్కడికి ప్రవేశించాడు. వచ్చిందే తడవుగా జగన్నాథుని హృదయంపై తటాలున కాలుతో తన్నాడు. ఒక్కసారిగా జరిగిన ఈ పరిణామానికి జగన్మాత ఉలిక్కి పడింది. కనుల ముందు జరిగినది అర్థం కావటం లేదు. శ్రీమన్నారాయణులవారు మాత్రం జరిగినదానికి ఏ మాత్రం చలించకుండా భృగుమహర్షులవారి పాదాన్ని చేతిలో తీసుకుని చిరునవ్వుతో "స్వామీ! నా హృదయాన్ని తాకిన మీ పాదం ఎంత నొచ్చుకున్నదో చూడండి. ఎంతగా కమిలిపోయిందో గమనించండి." అంటూ నెమ్మదిగా ఆ మహర్షిలోని అహంకారాన్ని అణిగేలా చేశాడు. అంతే మహర్షి తామసం పూర్తిగా తగ్గిపోయింది. 'స్వామీ జగన్నాయకా! త్రిమూర్తులలో ఉత్తముడవు నీవే! మా మహర్షులమందరమూ భూలోకంలో యజ్ఞం చేస్తూ యజ్ఞఫలం ఎవరికి ఇవ్వాలా అని నిశ్చయించుకొనడానికి నేను బ్రహ్మ, రుద్రుల వద్దకు వెళ్ళగా వారిద్దరూ అహంకారులని యజ్ఞఫలానికి అర్హులు కారని అనిపించింది. త్రిమూర్తులలో నీవే యజ్ఞఫలానికి అర్హుడవు. నీవే అత్యంత సౌమ్యుడవు. ఓ శ్రీమన్నారాయణా! మేము చేస్తున్న ఈ యజ్ఞ ఫలానికి ఈ విశ్వంలో నీవు తప్ప మరొకరు అర్హులు కారు' అని అన్నాడు.

ఇదంతా గమనిస్తున్న శ్రీ మహాలక్ష్మికి ఎంతో కోపం వచ్చింది. నా నివాస స్థలమైన వక్ష స్థలమందు తన్నటమా? ఎంతటి అవమానం? ఇంతటి ఘోరం చేసిన ఆ మహర్షిని స్వామి ఏమీ నిందించకపోవటమా? పైగా అతడి కాళ్ళు పట్టుకుని ఊరడించడమా? ఇంతటి అవమానం నేను భరించలేను. అని ఎంతో బాధపడి తక్షణమే వైకుంఠాన్ని విడిచి వెళ్లిపోయింది. మహాలక్ష్మి లేని వైకుంఠం కళావిహీనమైంది. తనపై అలిగి లక్ష్మి భూలోకానికి వెళ్లిపోవడంతో శ్రీమన్నారాయణులవారు ఎంతో బాధ పడ్డారు. లక్ష్మి కొరకై భూలోకానికి వెళ్లి కొండలు, గుట్టలు వెతుకుతూ వెంకటాద్రికి చేరుకున్నాడు. తిరిగి తిరిగి ఇక ఓపిక నశించి ఒక చోట చేరి మహాలక్ష్మికోసం తపస్సులోనికి వెళ్లిపోయాడు. అలా కొన్ని సంవత్సరాలు ఘోర తపస్సు చేశాడు. స్వామి చుట్టూ పెద్ద పెద్ద పుట్టలు వచ్చాయి. కానీ స్వామి తన తపస్సు మాత్రం మానలేదు.



లక్ష్మీనారాయణులు వైకుంఠం వీడిపోవడంతో వైకుంఠవాసులందరూ ఎంతో బాధ పడ్డారు. దేవతలందరూ జరిగినదంతా తెలుసుకుని ఎంతో చింతించారు. బ్రహ్మ దేవుడు మహేశ్వరుని వద్దకు వెళ్ళి ఇలా అన్నాడు. 'ఓ పరమేశ్వరా! మన ప్రియ సఖుడు శ్రీమన్నారాయణుని గమనించావా! అదిగో ఆ భూలోకంలో చూడు. తిండి తిప్పలు మాని శ్రీ మహాలక్ష్మికోసం ఎలా తపస్సు చేస్తున్నాడో చూడు! మనం ఇద్దరమూ తక్షణమే భూలోకానికి వెళ్లి ఆ స్వామి ఆలనా, పాలనా చూడాలి' అని అనగానే రుద్రుడు కూడా ఇందులకు ఒప్పుకుని బ్రహ్మ రుద్రులు ఇద్దరూ కలిసి భూలోకానికి మారువేషాలలో చేరారు.

ఆ రోజులలో వేంకటాద్రి ప్రదేశాన్ని ఒక చోళరాజు పరిపాలిస్తుండేవాడు. ఒకనాడు లక్ష్మీదేవి గోపాలిక రూపాన్ని, బ్రహ్మ ఆవురూపాన్ని, రుద్రుడు లేగదూడ రూపాన్ని ధరించి ఆ రాజు ఆస్థానానికి వెళ్లారు. గోపాలిక రూపంలో వున్న మహాలక్ష్మి చోళరాజుతో ఈ ఆవు

ఎంతో ఎక్కువ పాలు ఇవ్వగలదని, ఇది వున్నచోట సర్వ సంపదలూ కలుగుతాయని చెప్పింది. అప్పుడు చోళరాజు ఆ ఆవు, దూడలు తనకు కావలసిందిగా కోరగా లక్ష్మీదేవి అలాగేనని ఒప్పుకుంది. ఆ రెండింటినీ రాజుగారి గోశాలకు తరలించారు.

రోజూ గోశాలలోని అన్ని ఆవులతో పాటు బ్రహ్మ రూపంలో వున్న ఆవు కూడా మేతకు ఊరిబయటకు వెళ్ళేది. ఆవు మందనుంచి దూరం వెళ్ళి శ్రీనివాసుడు వున్న పుట్ట దగ్గరకు వచ్చి, పుట్టవద్ద నుంచుని పొదుగు నుండి పాలు స్రవించేది. ఆ పాలు త్రాగి శ్రీనివాసుడు తన ఆకలి తీర్చుకునేవాడు. అటు తరువాత తిరిగి తన మందలో కలిసిపోయి సాయంత్రానికి గోశాల చేరుతుండేది.

ఇలా కొన్ని రోజులు జరిగిన తరువాత గోపాలకులు ఈ ఆవు, దూడలు చిక్కిపోవటం గమనించారు. అంతేకాక సాయంకాలం గోశాలలో పాలు పితికే సమయంలో ఈ ఆవు వద్ద ఏ మాత్రం పాలు వుండేవి కావు. రోజు తరువాత రోజు ఇలా ఎందుకు జరుగుతున్నదో అర్థం కాక గోపాలుడు మరుసటినాడు ఎలాగైనా ఈ ఆవు రోజంతా ఎక్కడ తిరుగుతున్నదో గమనించాలని నిశ్చయించుకున్నాడు.

మరునాడు గోపాలుడు దూరం నుంచి గమనిస్తుండగా బ్రహ్మ రూపంలోని ఈ ఆవు మందనుండి వేరు పడటము, పుట్టవద్ద పాలు స్రవింపచేయటము గమనించాడు. 'ఓహో! ఇదా రోజూ జరుగుతున్నది. అని తలచి గోపాలుడు ఎంతో కోపావేశాలతో ఒక్కసారిగా అక్కడకు పరిగెత్తుకుని వెళ్లి చేతిలోని గొడ్డలితో ఆవును చంపబోయాడు. ఆవు రూపంలో వున్న బ్రహ్మదేవునికి అపకారం జరగనుందని గమనించిన



శ్రీమన్నారాయణుడు ఒక్కసారిగా పుట్టలోనుంచి పైకి లేచాడు. అంతే! ఆ గోపాలుని చేతిలోని గొడ్డలి శ్రీనివాసునికి తగిలి నుదుట గాయమై విపరీతముగా రక్తము కారసాగింది. ఒక్కసారిగా జరిగిన ఈ పరిణామానికి గోపాలుడు నిశ్చేష్టుడై ప్రాణాలు విడిచాడు.

ఈ విషయం తెలుసుకున్న చోళరాజు పుట్టవద్దకు వచ్చాడు. జరిగినదానికి రాజే కారణమని, శ్రీనివాసుడు చోళరాజును పిశాచముగా మారగలవని శపించాడు. వెంటనే చోళరాజు శ్రీనివాసుని సాక్షాత్తూ శ్రీమన్నారాయణునిగా గ్రహించి తన తప్పు క్షమించమని ఎంతో ప్రాధేయ పడ్డాడు. అందుకు జాలిపడి శ్రీనివాసుడు శాపవిమోచనం జరిగే మార్గం అనుగ్రహించాడు.

అటు తరువాత శ్రీనివాసుడు, దేవగురువైన బృహస్పతిని పిలిపించి, తన గాయాలకు మూలికా చికిత్స చేయించుకున్నాడు. ద్వాపర యుగంలోని యశోద వకుళ మాతగా జన్మించి ఆ సమీపంలోనే ఆశ్రమం నిర్మించుకుని నివసిస్తున్నది. నారదులవారి ద్వారా శ్రీమన్నారాయణుడు భూలోకానికి రావటము, తన ఆశ్రమానికి సమీపంలోనే వుండటము తెలుసుకుని స్వామిని కలిసింది. నాయనా! నీవు వచ్చి నా ఆశ్రమంలో వుండవలసింది. ఇకనుంచి నీపేరు శ్రీనివాసుడు అని అన్నది. శ్రీనివాసుడు అందుకు సంతోషించి ఆమెతోపాటు వెళ్లి ఆశ్రమంలోనే నివసించసాగాడు.

ఆ రాజ్యాన్ని పరిపాలిస్తున్న ఆకాశరాజు, ధరణీ దేవీ దంపతులకు వివాహమైన ఎన్ని సంవత్సరాలకూ సంతానం కలుగలేదు. ఎన్నో వ్రతాలు చేశారు, అనేక పుణ్యతీర్థాలను దర్శించారు. అయినా ఫలితం లేకపోయింది. చివరకు ఆస్థాన జ్యోతిష్కుల సలహా ప్రకారం ఆకాశరాజు పుత్ర కామేష్ఠి

యజ్ఞం తలపెట్టాడు. ఒక సుముహూర్తం నిశ్చయించుకుని బ్రాహ్మణులకు యజ్ఞానికి కావలసిన సామాగ్రి మొత్తం సమకూర్చాడు.

యజ్ఞ స్థలాన్ని పరిశుభ్రం చేసే పనిలో భాగంగా ముందుగా తానే స్వయంగా నాగలితో భూమిని దున్నడానికి ఉపక్రమించాడు. కొద్ది దూరం దున్నగానే ఒక్కసారిగా నాగలికి ఏదో వస్తువు తగిలిన శబ్దం అయ్యింది. ఏమై వుంటుందా అని ఆశ్చర్యంతో తవ్వి చూడగా ఒక సువర్ణ ఖచితమైన పెట్టె కనబడింది. ఆకాశరాజు వెంటనే భార్య ధరణీ దేవిని పిలిచి ఆ పెట్టె తెరచి చూశాడు. అంతే ఆ దంపతులకు ఎంతో ఆశ్చర్యం కలిగింది. ఆ పెట్టెలో సహస్ర దళ కమలాల మధ్య దివ్య తేజస్సుతో మెరిసిపోతూ ఒక పసిపాప కనిపించింది.

ఇంతలో ఆకాశవాణి ఇలా పలికింది. 'ఓ రాజా! ఈ పసిపాపను సామాన్య బాలికగా భావించవద్దు. ఈమె సాక్షాత్తూ లక్ష్మీదేవి అంశతో జన్మించినది. ఈమె వలన మీ దంపతుల జన్మ ధన్యమైంది. ఈ బాలిక ముందు ముందు నీకు అఖండ కీర్తిని తీసుకురాగలదు. ఈ శిశువు వలన నీ వంశంలోని ముందు, వెనుక తరాల వారందరూ తరించెదరు'. అని పలికింది. అప్పుడు ఆకాశరాజు దంపతులు మించిన ఆనందంతో యజ్ఞం పూర్తి చేసి ఆ పాపను అంత:పురానికి తీసుకుని వెళ్ళి 'పద్మావతి' అని నామకరణం గావించారు. పద్మావతి లభించిన శుభ విశేషం చేత ఆ దంపతులకు అనతికాలంలోనే మగపిల్లవాడు జన్మించాడు. ఆ బాలునికి వసునాయకుడని నామకరణం గావించారు.

పద్మావతి, వసునాయకులిద్దరూ అల్లారు ముద్దుగా ఆడుతూ పాడుతూ పెరిగి పెద్దవారయ్యారు. పద్మావతి అతిలోక సౌందర్యవతిగా



రూపుదిద్దుకున్నది. రతీదేవి యొక్క అందము, సరస్వతి వంటి విద్యా విజ్ఞానాలు, గౌరీదేవి వంటి వర్చస్సు, లక్ష్మీదేవి యొక్క తేజస్సు, అలంకారం కలిగి జగత్తులోనే అద్భుత సౌందర్యరాశిగా అలరారసాగింది. ఒకనాడు నారద మునీశ్వరుడు లోకవిహారం చేస్తూ ఆ రాజ్యానికి వచ్చి ఆకాశరాజు, ధరణీదేవి దంపతులవద్దకు వచ్చాడు. అక్కడ వున్న పద్మావతిని చూసి ఆ దంపతులతో ఇలా అన్నాడు. 'ఓ రాజ దంపతులారా! మీరు ధన్యులు. ఈ పద్మావతి సామాన్య యువతి కాదు. ఈమె సాక్షాత్తూ మహాలక్ష్మి అంశతో జన్మించినది. నీకు త్వరలోనే సాక్షాత్తూ శ్రీమన్నారాయణుడే అల్లుడు కాగలడు'. అని చెప్పి పద్మావతిని 'శీఘ్రమే కళ్యాణప్రాప్తిరస్తు!' అని దీవించి లోక సంచారానికై బయలుదేరి వెళ్లాడు.

రోజులిలా గడుస్తుండగా అక్కడ వకుళా దేవి ఆశ్రమంలో శ్రీనివాసుడు వకుళమాత చేసే సపర్యలతో సంతోషంగా కాలం గడుపుతున్నాడు. ఒకనాడు శ్రీనివాసునికి వేటకు వెళదామని తలంపు కలిగింది. ఈ మాటే తల్లితో చెప్పగా వకుళాదేవి శ్రీనివాసునితో 'నాయనా! నీవు అతి సుకుమారునివి. క్రూర మృగాలతో వేట చాలా ప్రమాదంతో కూడినది. వెళ్ళవద్దు నాయనా! అని వారించింది. అందుకు శ్రీనివాసుడు 'తల్లీ నీవేమీ చింతించవద్దు. ఆ మృగాలు నన్నేమీ చేయలేవు. నేను చక్కగా వేటాడి తిరిగి వస్తాను' అని చెప్పి వకుళమాత వద్ద సెలవు తీసుకుని వేటకు వెళ్ళాడు.

కొంతసేపు వేటాడిన తరువాత అలసిన శ్రీనివాసుడు సమీపంలో ఒక కొలను కనిపించడంతో కాసిని నీళ్ళు త్రాగి, ముఖము కడుగుకుని కాసేపు ప్రక్కనే వున్న వనంలో విశ్రమించాడు. ఇంతలో శ్రీనివాసునికి ఒక్కసారిగా కిలకిలమంటూ నవ్వులు వినబడ్డాయి. ఈ నవ్వులు ఎక్కడ

నుంచి వస్తున్నవో అని ఆలోచిస్తుండగా ఎదురుగా చెలికత్తెలతో వస్తున్న ఒక అద్భుత సౌందర్యరాశి శ్రీనివాసునికి కంటపడింది. ఆమె మరెవరో కాదు! ఇష్ట సఖులతో వన విహారానికై వచ్చిన రాకుమార్తె పద్మావతియే!.

పద్మావతి సౌందర్యానికి శ్రీనివాసునికి నోట మాటరాలేదు. పద్మావతి కూడా ఒక్కసారి శ్రీనివాసుని అద్భుత తేజస్సుకు ఆశ్చర్యపడి కనులింతగా చేసుకుని చూసింది. ఇంతలో పర పురుషుని ఈవిధంగా చూడటమా అని మనస్సులో తలంపు వచ్చినదై వెంటనే ముఖమును పక్కకు తిప్పుకున్నది. శ్రీనివాసుడు నెమ్మదిగా వారిని సమీపించి 'ఓ సుందరీ! నీవెవరవు? జగత్తులోని సౌందర్యమంతా నీలోనే వున్నది. నీవు నన్నెంతో ఆకర్షించితివి. నిన్ను భార్యగా చేపట్టని యెడల నా జీవితము వ్యర్థమని తోచుచున్నది. నీ తల్లిదండ్రులెవరు? వారిని తక్షణమే కలసి ఈ విషయం మాట్లాడి నిన్ను వివాహమాడ నిశ్చయించాను. ఈ నిర్ణయం తిరుగులేనిది. నిన్ను తప్ప వేరే కన్యను వివాహమాడను' అని అన్నాడు.

అప్పుడు పద్మావతి చెలికత్తెలు శ్రీనివాసునితో 'నీవెవ్వరివి? ఎక్కడనుంచి వచ్చినావు? నీ మాటలకి ఏమైనా అర్థమున్నదా? ఈమె ఎవరనుకున్నావు? ఈమె ఈ దేశాన్ని ఏలుతున్న ఆకాశరాజు ప్రియపుత్రిక పద్మావతి. సామాన్యుడవైన నీవెక్కడ? రాకుమార్తె ఈమెక్కడ? ఈమెను వివాహం ఆడే ఆలోచన మానుకుని తక్షణమే నీ ఇంటికి వెళ్లవలసింది'. అని చెప్పి అక్కడనుండి అందరూ వెళ్ళిపోయారు. సఖులతో కలసి వెళ్ళిపోతూ పద్మావతి ఒక్కసారిగా వెనుకకు తిరిగి శ్రీనివాసుని క్రీగంట చూసింది. ఆ చూపుతో శ్రీనివాసుడు మరింత ఉబ్బితబ్బిబ్బయ్యాడు.



ఆశ్రమానికి చేరిన శ్రీనివాసుడు వకుళమాతకు జరిగిన విషయమంతా వివరించాడు. పద్మావతిని తప్ప వేరెవరిని వివాహమాడనని చెప్పాడు. అందుకు వకుళమాత శ్రీనివాసునితో 'నాయనా! అతి సామాన్యులమైన మనమెక్కడ, ఎక్కడో అంత:పురంలో నివసించే ఆ పద్మావతి ఎక్కడ. దయచేసి ఆ ఆలోచనను విరమించు నాయనా' అన్నది. అయినా శ్రీనివాసుడు వినలేదు. పద్మావతిని తప్ప వేరే కన్యను వివాహమాడే ప్రసక్తి లేదన్నాడు.

అక్కడ అంత:పురంలో పద్మావతి పరిస్థితి కూడా ఇలాగే వున్నది. ఉద్యానవనంలో శ్రీనివాసుని చూసిన రాత్రి ఆమె కంటికి కునుకు లేదు. రాత్రంతా శ్రీనివాసుని రూపమే కనుల యెదుట కనిపించసాగింది. నిద్రలేమితో అలసటగా వున్న కుమార్తెను ఉదయం చూసిన తల్లి ధరణీదేవికి పద్మావతి ఎందుకు ఇలా వున్నదో అర్థం కాలేదు. పద్మావతి మాత్రం తల్లి ఎంతగా అడిగినా కూడా కారణం చెప్పలేదు.

రోజు రోజుకీ పద్మావతి విరహ వేదన ఎక్కువ కాసాగింది. ఏ ఆహారమూ తినబుద్ధి కావడం లేదు. ఆట పాటలన్నీ మానివేసింది. ఏ విషయం మీదికీ మనసు పోవటల్లేదు. ఎల్లప్పుడూ శ్రీనివాసుడే మదిలో మెదలుతున్నాడు. మనస్సులో ఒకటే ఆలోచన. తల్లిదండ్రులకు ఈ విషయం చెబితే సామాన్యుడైన ఒకనికి తననిచ్చి వివాహం చేయడానికి ఏ మాత్రం ఒప్పుకోరని తలచింది. అందుకే అటు శ్రీనివాసుని మరువలేక, ఇటు తల్లితండ్రులకు ఈ విషయం చెప్పలేక ఎంతో మధనపడుతూ నిద్రాహారాలు మానివేసి, రోజురోజుకీ కృంగి కృశించసాగింది.

ఆకాశరాజు దంపతులకు ఏమీ తోచట్లేదు. ఎంతో మంది గొప్పవైద్యులను పిలిపించి అనేక విధాల ప్రయత్నం చేశారు. అయినా పద్మావతిలో ఏ మాత్రం మార్పు రాలేదు. ఒకనాడు అంత:పురానికి ఒక ఎరుకలసాని వచ్చింది. ఆమె మరెవరో కాదు! మారు వేషంలో వచ్చిన శ్రీనివాసుడే! ఎరుకలసాని సోది చెప్తుంటే ఆమెలో ఏదో శక్తి ఉన్నట్లు అంత:పురంలోని వారికి అనిపించింది. వారు వెంటనే ఆమెను ధరణీదేవి వద్దకు తీసుకెళ్ళారు. ధరణీదేవితో ఎరుకలసాని 'అమ్మ! నేను ఉన్నది ఉన్నట్లు చెప్తాను. చెప్పింది చెప్పినట్లే జరుగుతుంది. నీ ఇంటిలో శాంతి లేదు. ఏదో బాధ నీ మనస్సును కలవరపెడుతున్నది' అన్నది. వెంటనే ధరణీదేవి' చూడు తల్లీ! నీలో ఏ శక్తి ఉన్నదో గానీ నీ మాటలు ఎంతో ఆకట్టుకుంటున్నాయి. నీవు చెప్పింది నిజం. మాకెవ్వరికీ ప్రశాంతత లేదు. మా కుమార్తె పద్మావతికి ఏదో వింత వ్యాధి పట్టుకున్నది. ఇది ఎవరికీ అర్థం కావటల్లేదు. నీవే చెప్పాలి!' అన్నది.

ఇంతలో పద్మావతిని అక్కడకు తీసుకురాగానే ఎరుకలసాని రూపంలో ఉన్న శ్రీనివాసుడు ఇలా చెప్పసాగాడు ' ఓ తల్లీ! నువ్వు ఒక పిల్లవాని మీద మనస్సు పడ్డావు. అడవిలో కనపడ్డాడు!.. అతడు సామాన్యుడు కాదే తల్లీ! ఆ శ్రీమహా విష్ణువే! ఆయన్ని నీవు వలచావు. నీ పెళ్ళి తప్పకుండా ఆయనతోనే అవుతుంది. నువ్వు కలకాలం సుఖంగా ఉంటావు. నీ కోరిక తీరుతుందే తల్లీ!' అని చెప్పింది.

ఈ మాటలు విన్న ధరణీదేవి ఆశ్చర్యపోయింది. ఇదా విషయం! అని పద్మావతిని అడుగగా ఎరుకలసాని చెప్పినదంతా నిజమేనని చెప్పింది. ధరణీదేవి ఎరుకలసానికి ఎన్నో బహుమానాలు ఇచ్చి పంపింది. ఆమె



వెళ్ళిన కాసేపటికి వకుళాదేవి అంత:పురానికి వచ్చింది. తను శ్రీనివాసుని తల్లిననీ, తన కుమారుడు పద్మావతిని వరించాడనీ చెప్పింది. ధరణీదేవి ఎంతో సంతోషించి భర్త ఆకాశరాజును పిలిచి జరిగిన విషయమంతా చెప్పింది. ఆకాశరాజు సాక్షాత్తూ శ్రీమన్నారాయణుడే తన అల్లుడు కాబోతున్నందుకు ఎంతో సంతోషించాడు. వకుళాదేవి కూడా ఎంతో సంతోషించి ఆ దంపతుల వద్ద శెలవు తీసుకుని తన ఆశ్రమానికి వెళ్ళింది.

ఆకాశరాజు, ధరణీదేవి దంపతుల ఆనందానికి అవధులు లేవు. ఈ ప్రపంచంలో ఎందరికి ఇంతటి భాగ్యం లభించగలదు? ఎన్ని కోట్ల జన్మల పుణ్యఫలమో కదా! సాక్షాత్తూ శ్రీమన్నారాయణుని అల్లునిగా పొందగలిగే భాగ్యం ఎంత మందికి కలుగుతుంది? మా జన్మ ధన్యమయింది. ఓ శ్రీమన్నారాయణా! ఇంతటి భాగ్యం అనుగ్రహించిన నీకివే మా నమస్కారములు. ఓ మహాలక్ష్మీ! ఈ ప్రపంచంలోని సర్వ ఐశ్వర్యాలకూ నియలమైన నిన్ను కుమార్తెగా పొందిన మేము ఎంతటి అదృష్టవంతులము తల్లీ! అని ఎంతో సంతోషపడ్డారు.

ఆకాశరాజు దంపతులు వారి గురువైన శుక మహర్షికి కబురు పంపించగా ఆ మహర్షి వెంటనే రాజప్రసాదానికి వచ్చాడు. మహర్షుల వారికి సకల సపర్యలూ గావించి జరిగిన విషయములన్నీ వివరంగా చెప్పారు. అప్పుడు శుక మహర్షి ఆ దంపతులతో ఇలా అన్నారు. 'ఓ రాజ దంపతులారా! దివ్య దృష్టితో నాకు అన్నీ విషయములూ తెలిసినవి. సాక్షాత్తూ శ్రీ లక్ష్మీనారాయణులనే కుమార్తె, అల్లుడుగా పొందిన మీ భాగ్యమెంతని వర్ణించగలను? ఎన్నో కోట్ల సంవత్సరాల తపస్సు చేతగానీ ఆ స్వామి దర్శనమే సాధ్యపడదే, అటువంటిది మీరు ఆ జగత్ కళ్యాణ

చక్రవర్తినే అల్లునిగా పొందుతున్నారు. ఆహా! ఎంతటి అదృష్టవంతులు! మీ పుణ్యం చేత ఈ దేశంలోని ప్రజలందరూ ఆ జగన్నాథుడు, జగన్మాతల కళ్యాణం దర్శించే భాగ్యం పొందబోవుచున్నారు. మీ దేశంలోని ప్రజలందరూ ఎంతో అదృష్టవంతులు' అని చెప్పాడు.

అప్పుడు ఆకాశరాజు దేవగురువైన బృహస్పతిని మనస్సులో ప్రార్థించగా ఆ మహర్షి వెంటనే ప్రత్యక్షమైనాడు. అప్పుడు బృహస్పతి, శుకమహర్షులు ఇరువురూ కుశల ప్రశ్నలు వేసుకుని శ్రీ లక్ష్మీనారాయణుల వివాహం గురించి తెలుసుకుని ఎంతో సంతోషించారు. అప్పుడు ఆకాశరాజు బృహస్పతితో 'ఓ మహర్షీ! మీరాక మాకెంతో సంతోషదాయకం. నన్ను అనుగ్రహించి శ్రీ పద్మావతీ, శ్రీనివాసుల వివాహ పత్రిక తమరు వ్రాయవలసినది' అని వేడుకున్నాడు.

అప్పుడు బృహస్పతులవారు ఆకాశరాజుతో 'రాజా! నీకు సాక్షాత్తూ శ్రీమన్నారాయణులవారే అల్లుడుగా లభ్యమగుట నీ పూర్వజన్మఫలము. నీ పుణ్యఫలము చేత సమస్త మానవకోటికీ, గరుడ, గంధర్వ, కిన్నెర, కింపురుషాదులకు శ్రీలక్ష్మీ శ్రీనివాసుల కళ్యాణము వీక్షించే భాగ్యము కలుగనున్నది. సమస్త లోకవాసులు కళ్యాణ విశేషములనే తలచుకుంటున్నారు. వారందరి ఆనందమూ వర్ణణాతీతము. వివాహము ఎప్పుడప్పుడా అని ఎంతో ఆత్రతతో ఎదురు చూచుచున్నారు. ఆ జగన్నాథుని కళ్యాణానికి ఏవిధంగా అలంకరించుకోవాలా అని ఇప్పుడే ఆలోచించడం మొదలుపెట్టారు. ఆ జగన్మూర్తుల కళ్యాణపత్రిక వ్రాసే అదృష్టం నాకు కలగటం నా భాగ్యం కాక ఇంకేమని చెప్పను. ఇదంతా ఆ దివ్యదంపతులు శ్రీలక్ష్మీనారాయణుల అనుగ్రహం తప్ప మరొకటి కాదు'



అని తలచి లగ్నపత్రిక వ్రాయడానికి ఉపక్రమించాడు. 'శ్రీ లక్ష్మీ నారాయణులను ఒక్కసారి మనస్సులో ప్రార్థించి ఇలా మొదలుపెట్టాడు. 'ఓ శేషాచలవాసుడైన శ్రీనివాసా! ఆకాశరాజు అనబడే నేను నా కుమార్తె పద్మావతిని తమకు ఇచ్చి వివాహము జరిపించడానికి ఎంతో సంతోషంతో నిశ్చయించుకున్నాను. అందులకు ఈ వైశాఖ శుద్ధ దశమీ శుక్రవారము దివ్యముహూర్తముగా పెద్దలు నిర్ణయించినారు. కావున తాము బంధుమిత్ర సపరివార సమేతముగా వచ్చి నాచే నొసంగబడు కన్యాదానమును స్వీకరించి మమ్ములను కృతార్థులను చేయవలసింది' అని వ్రాసాడు.

లగ్నపత్రికను బృహస్పతులవారు అక్కడ వున్న వారందరికీ చదివి వినిపించారు. లగ్నపత్రిక వ్రాయడం పూర్తవగానే ప్రకృతి పులకించింది అనడానికి సంకేతంగా చల్లని చిరుజల్లు కురిసింది. అప్పుడు ఆకాశరాజు తమ గురువైన శుకమహర్షికి ఈ లగ్నపత్రికను ఇచ్చి శేషాచలము వెళ్ళి శ్రీనివాసునికి అందియ్యవలసిందిగా ప్రార్థించాడు. అప్పుడా శుక మహర్షి 'ఓ రాజా! ఇంతకు మించిన అదృష్టమేమున్నది! తప్పక ఆ శ్రీనివాసుని దర్శించి ఈ లగ్నపత్రికను వారికి అందించగలవాడను' అని లగ్నపత్రికను కనులకు అద్దుకుని తక్షణమే శేషాచలానికి బయలుదేరి వెళ్ళాడు.

వకుళాదేవి ఆశ్రమానికి వచ్చిన శుకమహర్షికి ఎన్నో మర్యాదలు గావించబడ్డాయి. కాసేపు విశ్రమించిన తరువాత శుకమహర్షి తాను తీసుకువచ్చిన లగ్నపత్రికను ఒక్కసారి కనులకు అద్దుకుని శ్రీనివాసునికి అందించాడు. శ్రీనివాసుడు లగ్నపత్రికలోని విశేషములన్నీ చదివి ఎంతో ఆనందించి తన ప్రత్యుత్తరాన్ని ఈవిధంగా రాసి శుకునికి అందించాడు. 'ఓ మహారాజా! నీవు రాసిన లేఖను అందుకుంటిని. నీ కుమార్తె పద్మావతిని

నా భార్యగా స్వీకరించుట నాకెంతో సంతోషదాయకము. మేమందరము బహుదానందపడితిమి. నేను బంధుమిత్రులతో కూడి వచ్చి నీ కుమార్తె పద్మావతిని తప్పక ఆనందముతో స్వీకరించెదనని మనవి చేసుకుంటున్నాను' అని ఈ విధంగా రాసాడు. ఆ లేఖను తీసుకుని శ్రీనివాసుని వద్ద శెలవు తీసుకుని శుకమహర్షి ఆకాశరాజు వద్దకు తిరిగి వెళ్ళాడు.

శుక మహర్షి వెళ్ళిన వెంటనే శ్రీనివాసుడు కుబేరునికి కబురు పంపాడు. తక్షణం వచ్చిన కుబేరునితో 'కుబేరా! నాకు పద్మావతితో ఈ వైశాఖమాసంలో వివాహము కానున్నది. వ్యవధి చాలా తక్కువగా ఉన్నది. వివాహమునకు నాకు కావలసిన సొమ్ము నీవు సమకూర్చవలసినది. కలియుగములో నా భక్తులు సమర్పించే కానుకలతో నీ అప్పు తీర్చుకొనగలవాడను' అన్నాడు. అప్పుడు కుబేరుడు 'ఓ శ్రీనివాసా! శ్రీమన్నారాయణా! జగన్నాథా! నీవు నన్ను ధనం అడగడం కంటే నా అదృష్టమేమున్నది. సాక్షాత్తూ ఆ లక్ష్మీపతికే అప్పు ఇచ్చే భాగ్యం ఎందరికి కలుగుతుంది? తప్పక ఇస్తాను. నీకు కావలసినంత సొమ్ము ఇస్తాను. వివాహం రంగ రంగ వైభవంగా జరిగేలా దగ్గరుండి చూస్తాను. వివాహానికి కావలసిన ఖర్చులన్నింటికీ తప్పక ధనం నీకు సమకూరుస్తాను' అని అన్నాడు.

కుబేరుడు వెళ్ళగానే శ్రీనివాసుడు గరుత్మంతుని మనస్సులో తలచుకున్నాడు. గరుత్మంతుడు శ్రీనివాసుని ప్రథమ భక్తుడు. ఎల్లవేళలా శ్రీ స్వామివారి ఆజ్ఞకై రెక్కలు విప్పుకుని వేచి ఉండే ప్రియ భక్తుడు. గరుత్మంతుని స్వామి భక్తి అనన్యమైనది. శ్రీనివాసుడు తలచినదే తడవుగా గరుత్మంతుడు స్వామి ఎదుట ప్రత్యక్షమైనాడు. 'స్వామి! ఏమిటి మీ ఆజ్ఞ' అని వినయంగా అడిగాడు. 'ఓ గరుత్మంతా! నీకొక శుభవార్త. నేను



ఆకాశరాజు పుత్రిక పద్మావతిని ఈ వైశాఖమాసంలో వివాహమాడుతున్నాను. నీవు వెంటనే అన్ని లోకాలకూ వెళ్ళి అందరికీ ఈ విషయం చెప్పి, నా వివాహానికి వారందరినీ ఆహ్వానించవలసింది. ప్రతీ ఒక్కరినీ పేరు పేరునా పిలిచినట్లు చెప్పవలెను. వారందరి రాక నాకెంతో సంతోషదాయకమని చెప్పవలసింది. అన్ని లోకాలవారినీ ఆహ్వానించవలసింది. ఈ వివాహానికి ఒక మాసం ముందుగానే రావల్సిందిగా మరీ మరీ చెప్పవలసింది. ప్రతీవారినీ వారి వారి బంధుమిత్రులతో సహా రావల్సిందిగా నా మాటగా విన్నవించు' అని చెప్పాడు.

అప్పుడు గరుత్మంతుడు 'స్వామీ! పరంధామా! పరమపురుషా! నీ వివాహము ఈ జగత్తు అంతటికీ మహదానందమైనది. శ్రీ లక్ష్మీనారాయణుల వివాహం కనులారా గాంచే వారి అదృష్టం ఏమని చెప్పగలను? మీ దివ్యదంపతుల వివాహం చూసినవారి అదృష్టము, ఈ వివాహ విశేషాలన్నీ వినేవారి అదృష్టమూ ఇంత అంత అని చెప్పలేనిది. మీ దంపతుల వివాహ విశేషాలను తెలుసుకున్నవారి మునుపటి జన్మల పాపాలన్నీ తక్షణం పటాపంచలవుతాయి. ఈ వివాహ విశేషాలు విన్న వారి కోరికలన్నీ సత్వరం తీరుతాయి. వారికి సర్వ సౌభాగ్యాలు సమకూరుతాయి. మీ ఆనతి ప్రకారం నేను తక్షణం అన్ని లోకాలూ వెళ్ళి అందరినీ ఆహ్వానించి వస్తాను' అని స్వామి వారి దగ్గర శెలవు తీసుకుని బయలుదేరి వెళ్ళిపోయాడు.

గరుత్మంతుడు ముందుగా కైలాసానికి వెళ్ళి మహాశివుని దర్శనం చేసుకున్నాడు. గరుత్మంతుడు వచ్చేసరికి ఆది దంపతులిద్దరూ ఏదో విషయమై నవ్వుతూ ముచ్చటించుకుంటున్నారు. గరుత్మంతుడు వారికి నమస్కరించి వినయంగా నుంచున్నాడు. 'ఓ గరుత్మంతా! ఏమిటి విశేషం ! భూలోకంలో స్వామివారి విశేషాలేమైనా తెలిసినవా? వేంకటాచలంపై ఉన్న శ్రీనివాసుని

విశేషాలేమిటి?' అని అన్నాడు. అప్పుడు గరుత్మంతుడు వారితో ' దివ్య దంపతులరా! మీకివే నా నమస్కారములు. ఈ విశ్వంలో మీకు తెలియని విశేషాలేముంటాయి చెప్పండి! ఆది దంపతులు మీకు సర్వం ఎరుకయే కదా! శేషాచలం నుండే వస్తున్నాను. నా స్వామి శ్రీనివాసునికి ఆకాశరాజుపుత్రిక పద్మావతికి నిశ్చయమయింది. శ్రీనివాసుడు మిమ్మల్ని సపరివారసమేతంగా తన వివాహానికి రమ్మనవలసిందిగా ఆహ్వానించారు'. వైశాఖ శుద్ధ దశమినాడు జరిగే వివాహానికి మీరు తప్పక రావలసింది' అని అన్నాడు.

'అప్పుడు పార్వతి గరుత్మంతునితో 'వైనతేయా! ఎంత చక్కటి వార్త చెప్పావు. ఇదిగో నీకీ బహుమానం! అని తన పక్కనే ఉన్న ఫలాలు ఇచ్చి ఇలా అన్నది ' ఓ గరుత్మంతా! ఎంతటి తియ్యటి వార్త చెప్పావు! లక్ష్మీ నారాయణుల వివాహం భూలోకంలో శేషాచలంపై అద్భుతంగా జరుగబోతున్నందుకు చాలా సంతోషం. నా సోదరి పద్మావతిని నేనే దగ్గరుండి స్వయంగా పెండ్లికూతురిగా అలంకరిస్తాను. ఓ నాథా! మీరు మీ ప్రియసఖుడు శ్రీమన్నారాయాణులవారిని పెండ్లికుమారునిగా అలంకరించండి. సృష్టిలో ఉన్న ఐశ్వర్యమంతా మా పద్మావతిదే కదా! అద్భుత సౌందర్యరాశియైన ఆమె తమని ఎప్పుడెప్పుడు ధరిస్తుందా అని శతకోటి దివ్య ఆభరణాలు ఎంతో ఆత్రంగా ఎదురు చూస్తున్నాయి. వీటిలో వేటికి ఆ భాగ్యం కలుగనున్నదో కదా! ఎప్పటి దాకానో ఎందుకు? రేపే బయలుదేరి మేమందరం శేషాచలానికి వస్తాము. రేపటినుండే ప్రతిరోజూ నారాయణపురం వెళ్ళి పద్మావతిని రోజుకొకరీతిగా అలంకరిస్తాము. ఈ సమస్త జీవకోటి ఈ మధుర క్షణాలకే కదా ఎదురు చూస్తున్నది!' అని అన్నది.



గరుత్మంతుడు వారి వద్దనుంచి శెలవు తీసుకుని బ్రహ్మ లోకానికి బయలుదేరి బ్రహ్మదేవుని కలిసి శ్రీనివాసుని వివాహ విషయం చెప్పాడు. ఈ విషయంతో ఆ దంపతుల్లిదరూ ఎంతో సంతోషపడ్డారు. 'ఓ వైనతేయా! ఎంత చల్లని వార్త చెప్పావు! శ్రీలక్ష్మీనారాయణుల వివాహానికి రావడానికి మించిన ఆనందం మరేముంటుంది? మేమిద్దరం బంధుమిత్ర సపరివారంగా వివాహానికి వస్తున్నట్లు శ్రీనివాసునికి చెప్పవలసింది'. అని బ్రహ్మదేవుడు అన్నాడు. అప్పుడు సరస్వతీదేవి 'ఓ గరుత్మంతా! మా అనుంగు సోదరి మహాలక్ష్మిని నేనూ, గౌరీ దగ్గరుండి మరీ అలంకరిస్తాము.' అని అన్నది. గరుత్మంతుడు వారి వద్ద శెలవు తీసుకుని ఇంద్రలోకానికి వెళ్ళి ఇంద్రుని కలిసాడు.

ఇంద్రుని వద్దకు వచ్చిన గరుత్మంతుడు మహేంద్రునితో 'ఓ మహేంద్రా! శ్రీ పద్మావతీ శ్రీనివాసుల వివాహం ఈ వైశాఖ శుద్ధ దశమినాడు భూలోకంలో నారాయణపురంలో రంగ రంగ వైభవంగా జరుగనున్నది. నీవు, నీ సపరివార సమేతంగా వివాహానికి రావల్సింది' అని చెప్పాడు. అప్పుడు ఇంద్రుడు ఎంతో సంతోషపడి 'ఓ గరుత్మంతా! తప్పక వచ్చెదనని శ్రీమన్నారాయాణునికి విన్నవించవలసింది. శ్రీలక్ష్మీనారాయణుల వివాహాన్ని కన్నులార దర్శించటానికి మించిన భాగ్యం ఏముంటుంది? ఊర్వశి, మేనక, తిలోత్తమ మొదలైన దేవకన్యలందరూ తమ తమ నాట్యంతో వివాహానికి వచ్చిన అతిథులందరినీ అలరిస్తారు. ఈ వివాహం ఈ సృష్టి ఉన్నంత వరకూ అందరూ తలచుకునేలా అద్భుతంగా జరుగుతుంది' అన్నాడు.

ఇంద్రుని వద్ద శెలవు తీసుకుని గరుత్మంతుడు దేవతల శిల్పి విశ్వకర్మ వద్దకు వెళ్ళాడు. 'విశ్వకర్మా! నీకొక శుభవార్త తీసుకువచ్చాను. వైకుంఠ వాసుడైన శ్రీమన్నారాయణుడు భూలోకంలో శ్రీనివాసునిగా ఉన్న విషయం నీకు తెలిసినదే కదా! శ్రీనివాసునికి ఈ వైశాఖ మాసంలో సాక్షాత్తూ లక్ష్మీ స్వరూపురాలైన పద్మావతితో వివాహం కానున్నది. ఈ వివాహానికి సకల దేవతా గణమూ, సకల ముని గణమూ, సిద్ధి, కిన్నెర:కింపురుష గణములూ రానున్నవి. వీరందరికీ వసతి కోసమై నీవు శేషాచలముపై అద్భుతమైన నగరాన్ని నిర్మించవలసిందిగా శ్రీమన్నారాయణుడు నీకు చెప్పమన్నాడు. అలాగే వివాహానికి కూడా నీ సపరివార సమేతంగా రావల్సిందని స్వామి కోరుతున్నాడు' అని చెప్పాడు.

అప్పుడు విశ్వకర్మ వైనతేయునితో 'ఇంతకు మించిన భాగ్యమే మున్నది. నేను తప్పక రేపే పయనమై శేషాచలం చేరుకుని అద్భుతమైన నగరాన్ని నిర్మిస్తాను. అలాగే నారాణపురం వెళ్ళి ఆకాశరాజును కలిసి అక్కడ కూడా బ్రహ్మాండమైన వసతి గృహాలు నిర్మిస్తాను. కళ్యాణవేదికను అద్భుతంగా రూపొందిస్తాను. స్వామివారి అనుగ్రహం నాపై ఉన్నందుకు శ్రీనివాసునికి నా కృతజ్ఞతలు చెప్పవలసింది' అన్నాడు. గరుత్మంతుడు వారి వద్ద శెలవు తీసుకుని పయనమైనాడు.

అక్కడ నుంచి గరుత్మంతుడు మిగిలిన అష్ట దిక్పాలకులను, నవగ్రహ దేవతలను కలిసి శ్రీనివాసుని కళ్యాణానికి రావల్సిందిగా ఆహ్వానించాడు. వారందరూ ఎంతో ఆనందపడి శ్రీ పద్మావతీ శ్రీనివాసుల కళ్యాణానికి తాము తప్పక వస్తామని చెప్పారు.



కైలాసంలో పార్వతీ, పరమేశ్వరులు శ్రీనివాసుని కళ్యాణం గురించి ముచ్చటించుకుంటుండగా అక్కడకి చతుర్ముఖ బ్రహ్మ, సరస్వతితో సహా వచ్చాడు. వస్తూ 'ఓ పరమేశ్వరా! శుభవార్త విన్నావు కదా! మన నారాయణునికీ, లక్ష్మీ స్వరూపురాలైన పద్మావతికీ వివాహం! మనం ముందుగా వెళ్ళి శ్రీలక్ష్మీనారాయణుల వివాహాన్ని రంగ రంగ వైభవంగా జరిపించాలి. మీరెప్పుడు వెళుతున్నారో చెప్తే ఆనాడే మేము కూడా మీతో కలిసి వస్తాము.' అన్నాడు.

అప్పుడు గౌరీదేవి సరస్వతితో 'అక్కా! నీ రాక మాకెంతో సంతోషము. శ్రీనివాసుని కళ్యాణ బాధ్యత అంతా మనదే! ఇదంతా మన ఇంట్లో శుభకార్యమే కదా! ఈ సృష్టి మొత్తం ఆశ్చర్యపోయేలా అత్యంత మహదానందపడేలా ఎంతో కమనీయముగా, కన్నుల పండుగగా మనం శ్రీ పద్మావతీ శ్రీనివాసుల కళ్యాణం జరిపిద్దాము. అక్కడ, దేనికీ లోటు రాకుండా, ఎల్లప్పటికీ అందరూ తలచుకునేలా ఈ కళ్యాణాన్ని జరిపిద్దాము' అన్నది. ఇంతలో అక్కడికి అష్ట దిక్పాలకులు, నవగ్రహదేవతలు వచ్చారు. అప్పుడు వారితో పరమేశ్వరుడు 'ఓ అష్టదిక్పాలకులారా! నవగ్రహ దేవతలారా! మన శ్రీమన్నారాయణుడు పెండ్లికుమారుడు కాబోతున్నాడు! మన మహాలక్ష్మి పెండ్లికుమార్తె కాబోతున్నది వీరివురి కళ్యాణం ఈ జగత్తుకే కళ్యాణం. కాబట్టి మీరందరూ వివాహానికి ముందుగా శేషాచలం వెళ్ళి అన్ని ఏర్పాట్లనూ దగ్గరుండి చూడవలసింది.' అన్నాడు.

అప్పుడు ఇంద్రుడు 'ఓ పరమేశ్వరా తప్పక అలాగే జరిపిస్తాము. ఇంతకు మించిన ఆనందం మాకేముంటుంది? జగన్నాథుని కళ్యాణానికి మావంతు సహాయ, సహకారములు తప్పక అందిస్తాము. ఇది మా భాగ్యంగా

తలుస్తాము. అతిథులందరికీ అద్భుతమైన ఏర్పాట్లు చేస్తాము' అన్నాడు. అప్పుడు వాయుదేవుడు 'ఓ బ్రహ్మ, ఈశ్వరులారా! మీకివే నా నమస్కారములు. పద్మావతీ శ్రీనివాసుల కళ్యాణం జరిగే రోజుకు ముందు రెండు మాసాలనుంచే భూలోకం అంతా చల్లని గాలులు ఆహ్లాదకరంగా వీచేలా చూస్తాను. అతిథులందరికీ చల్లటి వాతావరణం కల్పిస్తాను' అని అన్నాడు. అప్పుడు సరస్వతి వాయుదేవునితో 'సంతోషం వాయుదేవా! కానీ స్వామివారి కళ్యాణ సమయంలో ఆ ఆనందం పట్టలేక విజృంభించవద్దు. ఒక్కసారిగా ప్రళయాంతరాళంగా మారగలదు. ఈ విషయం గుర్తుంచుకో!' అన్నది. 'అలాగే తల్లీ! నన్ను ఆటపట్టిస్తున్నావా జననీ! ఆనందంతో ఎంత ఒళ్ళు మరిచినా చల్లనిగాలి మాత్రమే వీచేలా చూస్తాను! అన్నాడు. పద్మావతీ, శ్రీనివాసుల వివాహం ముచ్చట్లు తలచుకుంటూ వారందరూ ఎంతో ఆనందపడ్డారు.

ఇంతలో అక్కడికి నారదులవారు నారాయణ నామము చేసుకుంటూ అక్కడికి వచ్చారు. అక్కడ ఉన్నవారందరినీ చూసి నారదుడు ఆశ్చర్యపోయాడు. 'ఏమిటీ విచిత్రం! దేవతలందరూ ఎందుకు సమావేశమైనట్లో! మీ అందరి ఆనందానికి కారణమేమై ఉంటుందో!' అని అన్నాడు. అప్పుడు గౌరీదేవి నారదునితో 'ఆ! ఏమిటి నారదా! మీ నారాయణుని వివాహమటగా! మాకు చెప్పనే లేదే! గరుత్మంతుడు వచ్చి చెప్పేవరకు మాకు తెలీనే లేదు!' అన్నది. అప్పుడు నారదుడు 'తల్లీ! ఆది దంపతులు మీకూ, సృష్టికర్త మా తండ్రి ఆ చతుర్ముఖునికి, సర్వజ్ఞాన ప్రదాత మా తల్లి సరస్వతికి తెలియని విశేషముంటుందా తల్లీ! ఏదో నన్ను ఆటపట్టిస్తున్నారు గానీ! అయినా నారాయణుడు నావాడేనా! మనందరి వాడు కదా! ముఖ్యంగా చెప్పాలంటే ముందుగా మీ త్రిమూర్తులలోని



ఒక్కడు! ఆ తర్వాతే గదా మా అందరివాడు' అన్నాడు. అప్పుడు చతుర్ముఖుడు నారదునితో 'ఓ నారదా! శ్రీలక్ష్మీ శ్రీనివాసుల వివాహం మనందరికీ ఎంతో సంతోషదాయకం. గరుత్మంతుడు అన్ని లోకాలూ వెళ్ళి, అందరికీ ఈ శుభవార్తను చేరవేస్తున్నాడు. ఈ ఆనందకర వార్తను చెప్పే సంతోషంలో పడి ఎవరినైనా మరిచిపోతాడేమో! కాబట్టి నీవు కూడా నీ లోక సంచారంలో నీవు కలిసేవారందరికీ ఈ శుభవార్తను చెప్పవలసింది. అందరినీ ఈ వివాహానికి తప్పక రావల్సిందిగా మా మాటగా కూడా చెప్పవలసింది. ఇంతకీ ముహూర్తం గుర్తున్నది కదా! రాబోయే వైశాఖ శుద్ధ పౌర్ణమి శుక్రవారం! నీ లోక సంచారంలో నీకు తారసపడే అందరికీ ఈ విషయం చెప్పవలసింది. అన్నాడు. అప్పుడు నారదుడు 'తండ్రీ! ఇంతకుమించిన ఆనందమేమున్నది. తమ ఆజ్ఞను శిరసా వహిస్తాను. అని వారందరి దగ్గరా శెలవు తీసుకుని వెళ్ళాడు. ఆ తర్వాత అక్కడ ఉన్నవారందరు కూడా తమ తమలోకాలకు తాము వెళ్ళారు.

శ్రీ పద్మావతీ, శ్రీనివాసుల కళ్యాణ వార్తను తెలియచేస్తూ అన్ని లోకాలూ తిరిగిన గరుత్మంతుడు చివరికి శేషాచలం చేరి శ్రీనివాసుని వద్దకు వచ్చాడు. స్వామివారితో 'స్వామీ! మీరు చెప్పినట్లే అన్ని లోకాలవారికీ మీ కళ్యాణ వార్తను చేరవేశాను. అందరూ ఎంతో సంతోషించారు. ఆ శుభ ఘడియల కోసం ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్నారు' అని చెప్పాడు.

ఆ మరునాడే విశ్వకర్మ తన సహాయకులందరితో కలసి శేషాచలం చేరాడు. రెండు రోజులలో శేషాచలమంతటినీ అద్భుతంగా తీర్చి దిద్దాడు. బ్రహ్మాండమైన విడిది గృహాలు, మధ్య మధ్యలో సెలయేళ్ళు, వసతి గృహాలలో అద్భుతమైన శిల్ప సంపద, చక్కటి ఉద్యానవనాలు.. శేషాచలం శోభ ఇంత, అంత అని చెప్పనలవి కానిది. పరమేశ్వరుడు, పార్వతీ విశ్రమించే వసతి

గృహం దివ్యంగా తీర్చబడింది. అలాగే చతుర్ముఖ బ్రహ్మ, సరస్వతిల వసతి గృహం కూడా ఎంతో శోభాయమానంగా అలంకరించబడింది. సృష్టికర్త బ్రహ్మ విడిది చేయబోయే వసతి గృహంలో స్తంభాలన్నీ అపురూపంగా తీర్చబడ్డాయి. ఏ స్తంభాన్ని తాకినా వేదపఠనం యొక్క నాదం వినిపిస్తుంది. పార్వతీ, పరమేశ్వరులు విడిది చేసే వసతి గృహంలో కొన్ని స్తంభాలని తాకితే ఓంకార నాదం వినిపిస్తుంది. మరికొన్నింటిని తాకితే ఢమరుకం ధ్వని వస్తున్నది.. ఇక మరి కొన్నింటిని తాకితే శంఖారావం వస్తున్నది. ఆహా! ఎంత అద్భుత శిల్ప సంపద! ఈ విధంగా దేవతలందరి వసతి గృహాలు ఎంతో అద్భుతంగా తీర్చబడ్డాయి.

ఇక పెండ్లికుమారుడైన శ్రీనివాసునికోసం ఒక ప్రత్యేకమైన భవనం రూపొందించబడింది. ఈ భవనంలో ఎన్నో గదులు నిర్మించబడ్డాయి. ప్రతీ గది ఎంతో అందంగా మలచబడింది. భవనానికి ఎదురుగా చక్కటి పూలతోటలు నిర్మించబడ్డాయి. భవనం పైన రంగు రంగుల పుష్పాలతో ఎంతో అద్భుతంగా శంఖు, చక్ర, నామాలు రూపొందించబడ్డాయి. శేషాచలంలో ఎక్కడ నుంచి చూసినా కనిపించేలా ఎంతో ఎత్తులో ఇవి అమర్చబడ్డాయి. శంఖ చక్ర నామాలను రూపొందించడానికి ఎన్నో అద్భుతమైన పూలను వాడటం జరిగింది. భవనంలో అనేక చోట్ల గోడలకు శంఖ చక్రాలు పూలతో చక్కగా తీర్చబడ్డాయి. రంగు రంగుల ముగ్గులు అలంకరించబడ్డాయి. ఎన్నో రకాల అలంకారాలతో శ్రీనివాసుని వసతి గృహం ఎంతో అందంగా తయారయింది.

ఆ రోజు వైశాఖ శుద్ధ పాడ్యమి. శేషాచలం అంతా కోలాహలంగా ఉంది. ఆ రోజు ఉదయం నుంచే అతిథిలందరూ రాసాగారు. ఉదయాన్నే పార్వతీ పరమేశ్వరులు ప్రథమ గణాలు ఎన్నో రకాలుగా అద్భుతంగా



నృత్యం చేస్తూ వెంటరాగా శేషాచలానికి చేరుకున్నారు. వారికి ఎదురేగి శ్రీనివాసుడు పరమేశ్వరుని కౌగలించుకున్నాడు. 'ఓ మహాశివా! నీరాక నాకెంతో ఆనందం. కైలాసం నుండి మీ అందరి రాక నాకు మహా సంతోషం' అని అన్నాడు. ఇలా పరమేశ్వరుడు, శ్రీమన్నారాయణులవారు కుశల ప్రశ్నలు వేసుకుంటుండగా వెనుకగా వస్తున్న బ్రహ్మ, సరస్వతీ కనపడ్డారు. దగ్గరకు రాగానే బ్రహ్మ విష్ణువుతో 'ఓ శ్రీనివాసా ! నీ వివాహం ఎప్పుడెప్పుడా అని మేమంతా ఎదురు చూస్తున్నాం. మేమేమిటి, ఈ విశ్వమంతా పద్మావతీ, శ్రీనివాసుల కళ్యాణానికై ఎదురు చూస్తున్నది. సరస్వతీ, పార్వతీ తమ ప్రియ సోదరి పద్మావతిని ఎప్పుడెప్పుడు పెండ్లికుమార్తెగా అలంకరించాలా అని ఉవ్విళ్ళూరుతున్నారు. ఇంకెంత? పదిరోజులే కదా! సమస్త దేవతా గణమూ ఈ శుభ ఘడియ కోసమే ఎదురు చూస్తున్నది.' అన్నాడు.

అప్పుడు శ్రీనివాసుడు 'ఓ బ్రహ్మదేవా! నీకివే నా నమస్కారములు. నీ రాక నాకెంతో సంతోషం. మీ అందరినీ చూస్తుంటే నాకు మిక్కిలి ఆనందం కలుగుతున్నది. ఈ నెలంతా ఇక్కడే ఉండి అతిథి మర్యాదలు స్వీకరించి మా శేషాచలవాసులందరినీ సంతోషింపచేయవలసిందిగా మనవి' అన్నాడు. శ్రీనివాసుడు పార్వతీ, పరమేశ్వరులకు వారి వసతి గృహాన్ని చూపించాడు. తరువాత బ్రహ్మ, సరస్వతిలకు వారి భవనానికి తీసుకువెళ్ళాడు. దేవతలందరూ వారికి చేసిన ఏర్పాట్లు చూసి ఎంతో సంతోషపడ్డారు.

వీరిద్దరూ వచ్చిన కొద్ది సేపటికే విఘ్నేశ్వరుడు, కుమారస్వామి వచ్చారు. విఘ్నేశ్వరుడు మూషికవాహనుడై రాగా, సుబ్రహ్మణ్యేశ్వరుడు శ్రీవల్లీ, దేవసేనలతో సహా నెమలి వాహనం పై వచ్చాడు. కార్తికేయుడు

వచ్చేముందు ఆ ప్రదేశమంతా ఎన్నో నెమ్మళ్ళు ఎంతో అందంగా పురి విప్పి నాట్యం చేసాయి. అక్కడ ఉన్న వారందరూ ఈ నెమళ్ళ నృత్యానికి ఎంతో ఆనందపడ్డారు. ఆ అద్భుత దృశ్యం చూడటానికి రెండు కళ్ళు చాలలేదనిపించింది. అటు తరువాత కాసేపటికి అష్ట దిక్పాలకులు, నవగ్రహ దేవతలూ వచ్చారు. అందరు కూడా వారి వారి వసతి గృహాలకు చేరి విశ్రమించారు. అటు తరువాత దేవలోకం నుండి అప్సరసలందరూ విచ్చేశారు. శ్రీనివాసుని కలిసి 'స్వామీ! శ్రీమన్నారాయణా! నీ వివాహం మాకెంతో ఆనందకరం. ఈ వివాహ సమయంలో మా నృత్యం చేత అతిథులందరినీ అలరించే భాగ్యాన్ని మాకు ప్రసాదించు స్వామి!' అని వేడుకున్నారు. అందుకు శ్రీనివాసుడు సంతోషంగా ఒప్పుకుని వారి విడిది గృహాలు వారికి చూపించగా అందరూ ఆ రోజుకి విశ్రమించారు.

ఇక అక్కడ నారాయణపురంలో పద్మావతికి కంటిమీద కునుకు లేదు. ఎప్పుడెప్పుడు శ్రీనివాసునితో వివాహమవుతుందా అని ఆత్రతతో ఎదురు చూస్తున్నది. ఆకాశరాజు దంపతుల ఆనందానికి అవధులు లేవు. నగరమంతా అద్భుతంగా అలంకరించబడింది. అంత:పురం అయితే ఇంక చెప్పనక్కర్లేదు. ఎంతో సుమనోహరంగా అనేక రకాల పుష్పాలతో దివ్యంగా అలంకరించబడింది. శేషాచలాన్ని అద్భుతంగా తీర్చి దిద్దిన విశ్వకర్మ నారాయణపురం కూడా వచ్చి వివాహానికి వచ్చే అతిథులకోసం ఎంతో అద్భుతమైన వసతి గృహాలు నిర్మించాడు.

ఇక కళ్యాణవేదికను తీర్చిదిద్దిన తీరును వర్ణించడానికి వేయి నాలుకలున్న ఆదిశేషునికి కూడా సాధ్యంకాదేమో అనిపిస్తున్నది. అంత కన్నుల కింపుగా అలంకరించబడినది. బంతి, చేమంతి పుష్పాలతో జాజులు, సంపెంగలు, మల్లెలు, గులాబీలు, కనకాంబరాలు.. ఆహా!



ఒకటేమిటి! ఎన్నో రకాల పూలతో అద్భుతంగా అలంకరించబడింది. ఆ వేదికను అలంకరించిన పువ్వుల సువాసనలు నారాయణపురం మొత్తం అతిథులతో మూడు పూటలు తాకుతున్నది. వివాహానంతరం వధూవరులు కూర్చొనడానికి రెండు అద్భుతమైన సింహాసనాలు ఏర్పాటు చేయబడ్డాయి. ఆ సింహాసనాలకు వజ్ర, వైడ్యూర్య, నీల, గోమేధుక, మరకత, మాణిక్య పుష్పరాగాలతో సహా అనేక దివ్యరత్నాలు పొందు పరచబడ్డాయి. ఒక్కొక్క సింహాసనం కనీసం అయిదుగురు మనుషులు కలిసి మోస్తేనేగానీ కదిలేలా లేదు. సింహాసనాలు రెండూ కూడా పూర్తి బంగారంతో చెయ్యబడ్డాయి. విశ్వకర్మ వీటిని ఎంతో అద్భుత నైపుణ్యంతో తీర్చిదిద్దాడు.

ఇంతలో పద్మావతిని పెళ్ళికుమార్తె చేసే రోజు రానే వచ్చింది. అంతకు ముందు రోజునే సాయంత్రానికల్లా సరస్వతీ, పార్వతి దేవిలు నారాయణపురానికి వచ్చి తమ విడిది గృహానికి చేరుకున్నారు. తెల్లవారురఝామునే అంత:పురానికి వెళ్ళి పద్మావతిని పెళ్ళికుమార్తె చేసే కార్యక్రమం ప్రారంభించారు. అంత:పురమంతా మంగళవాద్యాలు మ్రోగుతున్నాయి. సన్నాయి, నాద స్వరం ఎంతో కనులకింపుగా వినిపిస్తున్నాయి. సుమంగళీమణులు లక్ష్మీకళ్యాణ, గౌరీ కళ్యాణ కీర్తనలు పాడుతుండగా గౌరీదేవి పద్మావతికి మంగళ స్నానం చేయించింది. అటు తరువాత సరస్వతితో కలిసి గౌరీదేవి పద్మావతికి పట్టుచీర, రవిక ధరింపచేసి కురులు విడదీసి అనేక అలంకారాలు చేశారు.

సరస్వతి పద్మావతితో 'మీ శ్రీనివాసుడు ఎంత అదృష్టవంతుడమ్మా! ఇంత చక్కటి కుందనపు బొమ్మను భార్యగా పొందుతున్నాడు. ఈ సృష్టిలోని సకల ఐశ్వర్యాలకు నిలయమైన నిన్ను వివాహమాడే అదృష్టవంతుడు మా శ్రీనివాసుడు. ఓ మహాలక్ష్మీ! పద్మావతీ! నీవు సకల గుణ సంపన్నురాలవు.

శ్రీలక్ష్మీనారాయణుల జంటలోకానికే ఆదర్శం. నిన్ను పెండ్లి కుమార్తెగా అలంకరించే భాగ్యం కలిగినందుకు మేమెంతో సంతోషిస్తున్నాము. ఇవిగో! ఈ ఆభరణాలన్నీ చూడు! నీ కురులను అలంకరించడానికి ఎంతగా తాపత్రయ పడుతున్నాయో! నీ కురులను అలంకరిస్తే వాటి అందం మరింత ఇనుమడిస్తుందని ఈ గులాబీలు అనుకుంటున్నాయి. ఒక్క క్షణమైనా నీ కురులలో ఉండాలని ఈ మల్లెలు ఆత్రత పడుతున్నాయి. ఆ జాజులు చూడమ్మా మహాలక్ష్మీ! నువ్వు ముడుచుకుంటావో లేదోనని అవి ముడుచుకుపోతున్నాయి... ఆహా! ఈ పుష్పాలకు ఎంత ఆత్రంగా ఉన్నది! ఓ సముద్రరాజపుత్రికా! నిన్ను పెండ్లికుమార్తెగా అలంకరిస్తున్నందుకు మాకెంతో సంతోషంగా ఉన్నది' అని అన్నారు.

అటు తరువాత పద్మావతి చేత తల్లితండ్రులైన ఆకాశరాజు, ధరణీదేవి దంపతులకు నమస్కారం గావించారు. శ్రీనివాసుని చిత్రపటానికి నమస్కారం గావించారు. చిత్ర పటాన్ని క్రీగంటతో చూస్తూ, సిగ్గు పడుతూ, పూర్తిగా తలెత్తకుండా నమస్కారం చేసింది పద్మావతి.

పద్మావతిని పెళ్ళికుమార్తెగా అలంకరించిన తర్వాత సరస్వతీ, గౌరీదేవిలు తిరిగి శేషాచలం చేరుకున్నారు. బ్రహ్మ, పరమేశ్వరులకు అక్కడి విశేషాలన్నీ చెప్పారు. అవన్నీ తెలుసుకున్న వారందరూ ఎంతో సంతోషపడ్డారు. వారిరువురూ శ్రీనివాసునితో 'ఓ శ్రీనివాసా! నీ పద్మావతి ఎంత అందంగా ఉన్నదయ్యా! సాటి స్త్రీలమైన మాకే ఈర్ష్యకలిగేలా అద్భుత సౌందర్యరాశియై విరజిల్లుతున్నది! ఈ సృష్టిలోని సౌందర్యమంతా ఆమెదే! మీ ఇరువురి జంట ఈ లోకాలకే ఆదర్శం. ఎంతో చక్కని కన్నుల కింపైన జంట మీది! ఎప్పుడెప్పుడు మీ ఇరువురినీ కళ్యాణమంటపమై ఒకరి



పక్కగా నొకరిని చూస్తామా అని మా అందరికీ ఆత్రంగా ఉన్నది. ఈ భూలోకవాసులు ఎంతటి అదృష్టవంతులో కదా! దేవతలకు కూడా సాధ్యం గాని శ్రీలక్ష్మీనారాయణుల కళ్యాణాన్ని తిలకించే భాగ్యానికి నోచుకున్నారు. ఇక్కడి ప్రకృతి మొత్తం మీ కళ్యాణ ఘడియకై ఎదురు చూస్తున్నది. కోయిలలు గొంతెత్తి మంగళ గీతాలు పాడుతున్నవి. లేళ్ళు, జింకలు ఆనందంగా చెంగు చెంగున దూకుతూ శేషాచలమంతా కలియతిరుగుతున్నాయి. నెమళ్ళు పురివిప్పి అద్భుతంగా నాట్యం చేస్తున్నాయి. రంగు రంగుల చిలుకలు చెట్లపై చేరి కళ్యాణ విశేషాలను ముచ్చటించుకుంటున్నాయి. కుందేళ్ళు ఎంతో ముద్దుగా, ముచ్చటగా పొదళ్ళ వెంబడే దూకుతూ ఆడుకుంటున్నాయి. ఇక్కడి సరోవరాలలోని కలువలు ఎప్పుడెప్పుడూ ఆ శుభఘడియ వస్తుందా, ఎప్పుడెప్పుడు మేము ఆ మండపంలో అలంకరించ బడతాయా అని ఆత్రతగా ఎదురు చూస్తున్నాయి. రంగు, రంగుల గులాబీలు వారిలో ఎవరు శ్రీమహాలక్ష్మి తలలో తురుముకునే భాగ్యానికి నోచుకుంటామా అని ఎదురు చూస్తున్నాయి. కనకాంబరాలు కళ్యాణముచ్చట్లు గుసగుస లాడుకుంటున్నాయి. మీ లక్ష్మీనారాయణుల కళ్యాణం ఈ సృష్టిమొత్తానికే కళ్యాణం. ఈ సృష్టి మొత్తం ఎంతో కొత్త శోభను సంతరించుకుని ఆనందంగా ఆ శుభ ఘడియలకై ఎదురు చూస్తున్నది. ఓ శ్రీనివాసా! ఓ శ్రీమన్నారాయణా! ఓ జగన్నాథా! దేవలోకం నుంచి వచ్చిన మేమందరమూ కూడా కన్నులు కాయలు కట్టుకుని ఆ శుభ ముహూర్తానికై ఎదురు చూస్తున్నాము.' అని అన్నారు.

ఈ మాటలు విన్న శ్రీనివాసుడు 'అమ్మా! సరస్వతీ దేవీ! గౌరీమాతా! నా ఎడల మీ అనురాగం, ఆప్యాయతకు ఎంతో సంతోషం. శ్రీ పద్మావతిని దగ్గరుండి పెళ్ళికుమార్తెగా అలంకరించినందులకు నాకెంతో ఆనందం.

సాక్షాత్తూ మీరే వచ్చి పద్మావతిని పెండ్లికుమార్తెగా అనేక రకాల ఆభరణాలతో అలంకరించడం నాకూ, మా శేషాచల వాసులందరికీ ఎంతో సంతోషం, మహదానందకరం. వివాహం నాడు కూడా మీరిద్దరూ కళ్యాణవేదికపైనే ఉండి వివాహ కార్యక్రమం అంతా చతుర్ముఖుడు, పరమేశ్వరునితో కలిసి పర్యవేక్షించవలసిందిగా నా మనవి. వివాహానికి వచ్చిన స్త్రీలందరికీ కావలసినవన్నీ సమకూరాయో లేదో మీరూ దగ్గరుండి చూడవలసింది. అని అన్నాడు. అప్పుడు ఆ తల్లులిద్దరూ ఎంతో సంతోషపడి పద్మావతికి దగ్గరుండి అన్నీ ముచ్చట్లు జరిపిస్తామనీ, పద్మావతీ శ్రీనివాసుల వివాహం జరుగుతున్నంత సేపూ తాము కళ్యాణవేదిక పైననే ఉంటామనీ చెప్పారు.

అటు తరువాత వీరిద్దరు కలిసి శేషాచలంలోని వసతి గృహాలన్నీ కలియతిరుగుతూ శచీదేవిని, దేవలోకపు అప్సరసలు ఊర్వశి, మేనక, తిలోత్తమలను అహల్య, అరుంధతి మొదలుగా గల మునిపత్నులను, కుమారస్వామి పత్నులు శ్రీవల్లీ, దేవసేనలను, ఇంక అనేక మందిని కలిసి, కుశల ప్రశ్నలు వేసి వారికి కావలసినవన్నీ సమకూరుతున్నాయా అని కనుక్కున్నారు. సాక్షాత్తూ జగన్మాతలే ఈ విధంగా రావడం చూసి వీరందరూ ఎంతో ఆనందపడి, సౌకర్యాలన్నీ అద్భుతంగా ఉన్నాయని అన్నారు. అటు తరువాత సరస్వతీ, గౌరీదేవిలిద్దరూ తమ తమ వసతి గృహాలకు చేరుకున్నారు.

శేషాచలమంతా దివ్యంగా వెలిగిపోతున్నది. సమస్తదేవతా గణమూ ఇక్కడే ఉండటం చేత దివ్య తేజస్సుతో ప్రకాశిస్తున్నది. ప్రతీరోజు సాయంకాలం దేవకన్యలు అద్భుత నృత్యాలతో అతిథులను అలరిస్తున్నారు. అగ్ని దేవుడు వచ్చినవారందరికీ కావలసిన ఆహార ఏర్పాట్లను చూస్తున్నాడు. ప్రతీ పూట అతిథులకు రకరకాల పిండి వంటలు వడ్డించబడుతున్నాయి.



ప్రతీ పూట కొత్త కొత్త వంటకాలు అతిథులను అలంకరిస్తున్నాయి. మహాలక్ష్మీదేవి సోదరుడైన చంద్రుడు ప్రతీరాత్రీ చల్లని కాంతులను వెదజల్లుతున్నాడు. సూర్యభగవానుడు పగలంతా ఎక్కువ తీవ్రత లేకుండా అతిథులకు వాతావరణం ఆహ్లాదకరంగా ఉండేలా చూస్తున్నాడు. వరుణుడు సాయంకాలంలో సన్నని జల్లులు కురిపించి ఆహ్లాదపరుస్తున్నాడు. వాయుదేవుడు చల్లని చిరుగాలులతో అతిథులందరినీ చక్కటి అనుభూతులలో తేలియాడిస్తున్నాడు. వివాహ ఏర్పాట్లన్నీ ఘనంగా, అతిథులందరూ ఎల్లప్పటికీ మరిచిపోలేనట్లుగా ఉన్నాయి.

ఇక రేపే వైశాఖ శుద్ధ పౌర్ణమి, ముందు రోజు సాయంత్రం మగపెళ్ళివారు నారాయణపురం బయలుదేరటానికి సిద్ధమయ్యారు. అతిథులందరూ అద్భుతమైన వస్త్రాలతో, చక్కటి అలంకరణతో తయారయినారు. ముందుగా చతుర్ముఖ బ్రహ్మ, సరస్వతీ సమేతంగా బయలుదేరాడు. వెనుకనే పార్వతీ, పరమేశ్వరులు ఉన్నారు. అటు తరువాత విఘ్నేశ్వరుడు, కుమారస్వామి రాగా వారి వెనుకనే పెండ్లికుమారుడు శ్రీనివాసుడు దివ్యాలంకార భూషితుడై, పట్టు పీతాంబరాలు ధరించి గరుత్మంతుని అధిరోహించి బయలుదేరాడు. అటు తరువాత అష్టదిక్పాలకులు, నవగ్రహదేవతలూ, సమస్త దేవతా గణమూ, సమస్త ముని గణమూ, యక్ష, కిన్నెర, కింపురుష గణాలూ బయలుదేరాయి. మంగళ వాయిద్యాలతో మగపెండ్లివారి బృందం నారాయణపురం చేరుకుంది.

ముందుగానే ఈ వార్తను తెలుసుకున్న ఆకాశరాజు నగరం బయటనే వీరికోసం మంగళవాయిద్యాలతో, కస్తూరీ, సుగంధ ద్రవ్యాలతో, రకరకాల పుష్పమాలలతో వేచి ఉన్నాడు. ధరణీ దేవి అల్లునికి హారతి పట్టడానికి అంత:పుర కాంతలతో కలిసి ఎదురుచూస్తున్నది. సుమంగళీమణులు

దివ్య కీర్తనలు ఆలపిస్తున్నారు. ముందుగా వచ్చిన బ్రహ్మ, సరస్వతిలను చూసి ఆకాశరాజు దంపతులు అనేక విధాల నమస్కరించి 'ఓ బ్రహ్మదేవా! శ్రీనివాసుని దయవలన మీరందరినీ కనులారా గాంచే భాగ్యం నాకు కల్గినది. నా కుమార్తె పద్మావతి శ్రీనివాసుని వలచుట, అందులకు ఆ స్వామి అంగీకరించుట నా భాగ్యం. శ్రీ లక్ష్మీనారాయణుల కళ్యాణం కాబట్టే సాక్షాత్తూ సృష్టికర్తవైన నీవే తరలివచ్చావు' అని అన్నాడు.

ఇలా అంటుండగా వెనుకనే వచ్చిన పార్వతీ, పరమేశ్వరులు కనపడ్డారు. ఆహా! పరమేశ్వరా! జగన్నాథా! ఆది దంపతులారా! పార్వతీ పరమేశ్వరులారా! నా జన్మ ధన్యం. మీరు మా నగరానికి నా అతిథిగా రావడం నేను ఎన్నో కోట్ల జన్మలలో చేసుకున్న పుణ్యఫలం తప్ప మరొకటి కాదు. లేకపోతే అతి సామాన్యుడనైన నేనెక్కడ ఈ సృష్టిస్థితి లయకారకులైన మీరెక్కడ! ఆహా! ఈ జన్మకీ భాగ్యం చాలును!' అన్నాడు. అప్పుడు పరమేశ్వరుడు 'ఓ ఆకాశరాజా! ఇదంతా మా శ్రీనివాసుని చలవ. మా త్రిమూర్తులలో ఒకడైన శ్రీమన్నారాయణుని వివాహం మేము లేకుండా జరగడం ఊహించగలమా! శ్రీలక్ష్మీ నారాయణుల వివాహం దగ్గరుండి చూడాలనీ మేమూ, మాతోపాటు సరస్వతీ, గౌరీలు ఎంతో ముచ్చట పడుతున్నారు.' అని అన్నాడు.

వీరిరువురూ ఇలా మాట్లాడుకుంటుండగా వెనుకనే దేవతలందరూ రాసాగారు. ఇక పెండ్లికుమారుడు శ్రీనివాసుడు రావడమే తరువాయి! ఇలా ఆకాశరాజు తలచేటంతలో దూరంగా దేవదుందుభిలు మోత వినిపించింది. మంగళవాద్యాలు అద్భుతంగా చెవులకింపుచేస్తున్నాయి. ఒక్కసారిగా వాతావరణం అంతా చల్లగా, ఆహ్లాదకరంగా మారింది. ఎక్కడినుంచో అద్భుతమైన సుగంధం వస్తున్నది. నెమళ్ళ గుంపులు



నాట్యమాడుతూ వస్తున్నాయి. వెనుకనే లేళ్ళు ఎంతో అందంగా గెంతుతున్నాయి. ఇక వస్తున్నది శ్రీనివాసుడే! అనుమానం లేదు! సాక్షాత్తూ శ్రీమన్నారాయణుడే పెండ్లికుమారునిగా వస్తున్నాడు! ఆహా! అక్కడ ఉన్నవారందరూ ఎంత అదృష్టవంతులో కదా! ఆకాశరాజు ఎంతో ఆనందంతో మాటలురాని వాడైనాడు.

ఇంతలో శ్రీనివాసుడు ఎదురుగా వచ్చాడు. ఆ స్వామి దివ్య మంగళ రూపం చూసిన ఆకాశరాజు, ధరణీదేవి దంపతుల ఆనందానికి అవధులు లేవు 'ఓ శ్రీనివాసా శ్రీమన్నారాయణా! ఎవరి దర్శనం కోసం సమస్త మునిగణమూ వేలాది సంవత్సరాలుగా తపస్సు చేస్తున్నారో, ఎవరి అనుగ్రహం కోసం సమస్త దేవతా గణమూ ఎల్లవేళలా ఎదురు చూస్తున్నదో ఎవరి తేజస్సు కోటిసూర్యుల తేజస్సుకంటే కూడా మించినదో, ఎవరు ఈ సృష్టిలోని జీవులందరి హృదయాలలో అంతర్యామిగా భాసిస్తున్నారో, అటువంటి నీ దర్శనం కలగడమూ, సాక్షాత్తూ నిన్నే నా అల్లునిగా పొందగలగటము ఎంతటి భాగ్యమో కదా! నీవు మా నారాయణపురంలో కాలిడడంతో మా రాజ్యపు ప్రజలందరూ పునీతులయ్యారు. అందరి జన్మలూ ధన్యమైనాయి. ఓ శ్రీనివాసా! శ్రీమన్నారాయణా! మా కుమార్తెను చేపట్టి మమ్ములను ధన్యం చేయవలసినదిగా ప్రార్థన. మా ఆతిథ్యము స్వీకరించి, ఆతిథి మర్యాదలతో మీ తరపువారెవరికైనా ఎటువంటి చిన్న ఇబ్బంది కలిగినా క్షమించవలసిందిగా అర్థిస్తున్నాను' అని అన్నాడు.

అప్పుడు శ్రీనివాసుడు చిరునవ్వుతో 'ఓ ఆకాశరాజా! నీ కుమార్తె పద్మావతిని భార్యగా స్వీకరించుట నాకెంతో సంతోషము. పెండ్లి ఏర్పాట్ల విషయమై నీవేమీ చింతించవలదు. వివాహం రంగ రంగ వైభవంగా జరుగుతుంది. సర్వదేవతా గణమూ ఇక్కడే ఉండగా ఇంక నీకేమి చింత?'

అని అన్నాడు. అప్పుడు ధరణీ దేవి పెండ్లికుమారునికి మంగళహారతి ఇచ్చింది. సుమంగళీమణులు మంగళహారతుల పాటలు పాడుతుండగా వారితో సరస్వతీ, గౌరీదేవిలు కూడా గొంతు కలిపి పాడుతుంటే అందరూ తమ జన్మ ధన్యమైనదని సంతోషించారు. అటుతరువాత శ్రీనివాసుని విడిది మందిరం వరకు ఆకాశరాజు సాగనంపాడు. దేవతలందరూ కూడా వారి వారి విడిది గృహాలకు వెళ్ళారు.

ఆ రోజు రాత్రి అతిథులందరికి షడ్రసోపేతమైన విందు భోజనం ఏర్పాటు చెయ్యబడింది. రకరకాల కూరగాయలతో ఎంతో రుచికరంగా ఎన్నో రకాల వంటకాలు చెయ్యబడ్డాయి. ఆకాశరాజు దగ్గరుండి వంటలన్నీ పర్యవేక్షించాడు. దేవతలందరూ భోజనశాలకు వచ్చి ఎంతో ఇష్టపడుతూ అన్ని వంటకాలనూ రుచి చూశారు. పెండ్లికుమారుడు శ్రీనివాసుని మందిరానికే విందు భోజనం పంపబడింది. ఆకాశరాజు బ్రహ్మ, పరమేశ్వరుడు, విఘ్నేశ్వరుడు, కుమారస్వామి మొదలైన దేవతలతో వారి వారి వసతి గృహాలకే పంపే ఏర్పాట్లు చెయ్యబోగా, వారందరూ తమకు ఇక్కడికి భోజనశాలకే వచ్చి దేవతలందరితోనూ కలసి విందారగించటం సంతోషదాయకమని అన్నారు. తమతో కలసి విందు భోజనం చేస్తున్న బ్రహ్మ, పరమేశ్వరుని చూసి దేవతలందరు ఎంతో ఆశ్చర్యపోయారు. ఎంతో ఆనందపడ్డారు. తెల్లవారితే జరగబోయే శ్రీలక్ష్మీనారాయణుల వివాహ విశేషాలను ముచ్చటించుకున్నారు. చిరంజీవులైన హనుమంతుడు, అశ్వత్థామ, బలి, మార్కండేయుడు, వ్యాసుడు వివాహానికి వచ్చి భోజనశాలకు చేరుకున్నారు. హనుమంతుని చూసిన పరమేశ్వరుడు కుశల ప్రశ్నలు వేసాడు.



ఇంతలో అటుగా విఘ్నేశ్వరుడు, కుమారస్వామి కూడా వచ్చారు. హనుమంతుడు విఘ్నేశ్వరుని పలకరించాడు. వివాహ విశేషాలు ముచ్చటించాడు. ఇంతలో అక్కడికి స్వామి వారికి ప్రియభక్తుడైన ఆదిశేషుడు కూడా వచ్చాడు. కాసేపు విఘ్నేశ్వరుడు, ఆదిశేషుడు కుశల ప్రశ్నలు వేసుకున్నారు. ఇలా అందరు దేవతలను ఒకచోట చూసిన అందరికీ ఎంతో ఆనందం కలిగింది. ఆకాశరాజు వారందరి వద్దకు వచ్చి అన్ని వంటకాలూ భుజించారో లేదోనని కనుక్కుంటున్నాడు. ధరణీదేవి కూడా స్త్రీలందరినీ పేరు పేరునా పలకరించి అన్ని వంటకాలు దగ్గరుండి వడ్డించింది. సమస్త దేవతలూ, సమస్త యక్ష, కిన్నర, కింపురుష గణాలూ, సమస్త మునిగణమూ కలసి తమ నగరంలో సహపంక్తి భోజనాలు చేయడం తన పూర్వజన్మ అదృష్టమని ఆకాశరాజు అందరికీ విన్నవించుకున్నాడు.

భోజనాల అనంతరం అందరూ తమ తమ విడిది గృహాలకు వెళ్ళి విశ్రమించారు. పరమేశ్వరుడు తన అతిథి గృహంలో నిద్రకు ఉపక్రమించబోతుండగా బ్రహ్మదేవుడు అక్కడికి వచ్చాడు. బ్రహ్మను చూసిన పరమేశ్వరుడు, చతుర్ముఖుడు ఈ వేళలో వచ్చాడేమిటి ఏదో విశేషమే ఉండాలి' అనుకున్నాడు. అప్పుడు బ్రహ్మ ఈశ్వరునితో 'ఓ పరమేశ్వరా! నీకు తెలియని విశేషమేమున్నది చెప్పు. రేపు జరగబోయే శ్రీలక్ష్మీనారాయణుల కళ్యాణం జగత్కళ్యాణమే. ఇది మనందరికీ ఎంతో సంతోషదాయకం. రేపటి కళ్యాణం గురించి తలుస్తున్న నాకు ఒక ఆలోచన కలిగింది. ఆ విషయం నీకు చెప్పాలనే ఇక్కడకు వచ్చాను. శ్రీ పద్మావతీ, శ్రీనివాసులు వివాహానంతరం కొన్ని రోజులు తరువాత శేషాచలం వెళ్తారు గదా! వెళ్ళిన తరువాత హృదయ లక్ష్మీ సమేతుడై శ్రీనివాసుడు ఆనందనిలయములో ప్రవేశించే ఆనందాన్ని పురస్కరించుకుని నేను

బ్రహ్మాండమైన ఉత్సవాన్ని తలపెట్టదలచాను. శేషాచలం అంతా రంగ రంగ వైభవంగా అలంకరించి ఆ ఉత్సవానికి మనం సమస్త దేవగణాలనూ ఆహ్వానిద్దాము. మన ప్రియ సఖుడు శ్రీనివాసుడు ఆనంద నిలయంలో ప్రవేశంచే వేళ మనందరికీను, అటు తరువాత కలియుగంలోని భక్తులందరికీను ఎల్లప్పటికీ గుర్తుండేలా, కన్నుల పండువుగా జరగాలని నాకు తోచింది. దీనికి నీ సహాయం కూడా కావాలి. క్షేత్ర పాలకునివి నీవేకదా ఇక ఆలోచన మనస్సులో వచ్చినదే తడవుగా నీతో పంచుకుందామని హుటాహుటిన వచ్చాను. నీకు నిద్రాభంగం అయినందుకు క్షమింపవలసింది' అన్నాడు.

అది విన్న మహేశ్వరుడు 'ఆహా! ఎంత అద్భుతమైన ఆలోచన! ఇంతకుమించిన ఆనందం మరేముంటుంది. అలాగునే తప్పక జరిపిద్దాము. ఈ ఆలోచన నీకే వచ్చింది గాబట్టి ఈ ఉత్సవాలు బ్రహ్మోత్సవాలుగా పిలవబడుతాయి. ఇవి ఎల్లప్పటికీ నిరాటంకంగా, అద్భుతంగా, కన్నుల పండుగగా జరుగుతాయి. బ్రహ్మోత్సవాలకు శ్రీ భూసమేత శ్రీనివాసుని దర్శించే భక్తులకు ముక్తి నొసంగగలవాడనని నేను అనుగ్రహిస్తాను. అలాగే బ్రహ్మోత్సవాలలో స్వామిని దర్శించిన వారికి శ్రీదేవీ భూదేవీ సమేతంగా ఊరేగే శ్రీనివాసుని దర్శించిన వారికి అకాలమరణం ఉండదు. ఎటువంటి అనారోగ్యమూ దరిచేరదు. ఓ బ్రహ్మదేవా! నీవన్నట్లే ఉత్సవాలను శేషాచలంపై అద్భుతంగా నిర్వహిద్దాము' అన్నాడు.

బ్రహ్మ, రుద్రులు ఇలా మాట్లాడుకుంటుండగా అక్కడికి పార్వతీదేవి వచ్చింది. పరమేశ్వరుడు ఆ తల్లికి వారు తలచిన బ్రహ్మోత్సవ విశేషాలు చెప్పాడు. అప్పుడు గౌరీదేవి 'ఆహా! చాలా సంతోషం అయితే నాదొక మనవి. ముచ్చటకూడాను. బ్రహ్మోత్సవాలలో ఒక రోజు నా వాహనమైన



సింహాన్ని శ్రీనివాసునికి ఇస్తాను. శ్రీమన్నారాయణుడు ఈ వాహనంపై ఎక్కి ఊరేగే వైభవం చూడాలని నాకు ముచ్చటగా ఉన్నది'. అని అన్నది. అందుకు మహేశ్వరుడు తప్పక అలాగే చేద్దామనీ, చాలా సంతోషమనీ అన్నాడు. అటు తరువాత బ్రహ్మ వారిద్దరి వద్ద శెలవు తీసుకుని తన విడిది గృహానికి వెళ్ళిపోయాడు.

ఆరోజు వైశాఖ శుద్ధ దశమి. సూర్యభగవానుడు ఉదయాన్నే ఎంతో ఆనందంగా ఉన్నాడు. ఆరోజే పద్మావతీ, శ్రీనవాసుల కళ్యాణం. ప్రకృతి అంతా పులకరించి పోతున్నది. సరస్సులలోని కమలాలు ఎంతో ముచ్చటగా విచ్చుకున్నవి. పక్షులు కలకలరావాలు చేస్తూ చెవులకు ఇంపు కలిగిస్తున్నాయి. నారాయణపురం అంతా హడావిడిగా ఉన్నది. దేవతలందరూ ఎంతో అద్భుతమైన వస్త్రాలను ధరిస్తున్నారు. ఆనాటి శ్రీలక్ష్మీనారాయణుల వివాహానికి అందరూ అనేక ఆభరణాలను ధరించి తయారవుతున్నారు. సుమంగళీమణులు ఎంతో అందమైన వస్త్రాలను ధరించి, పుష్పాలతో కురులను అలంకరించుకుని, రకరకాల దివ్య ఆభరణాలతో ముస్తాబవుతున్నారు.

ఆకాశరాజు, ధరణీదేవి దంపతులు వరపూజకు కావలసిన వస్తువులన్నీ సిద్ధము చేసుకుని నూతన వస్త్రాభరణములు, రంగు రంగుల పూల హారాలు, తాంబూలములు, ఎన్నో దివ్య కానుకలను తీసుకుని శ్రీనివాసుని విడిది గృహానికి బయలు దేరారు. వారితో పాటే శుక, బృహస్పతి మహర్షులు కూడా బయలుదేరారు. ఆకాశరాజు వెనుక సమస్త బంధు జనము వచ్చింది. వీరందరు కలసి మేళతాళాలతో శ్రీనివాసుని విడిది గృహానికి వచ్చారు. అక్కడ అప్పటికే చతుర్ముఖ బ్రహ్మ, పరమేశ్వరుడు, అష్ట దిక్పాలకులు, నవగ్రహదేవతలూ, మొదలైన

దేవతలందరూ వచ్చి ఉన్నారు. అక్కడ ముని గణములోనున్న వశిష్టులవారు ఆకాశరాజుతో వరపూజ గావించవలసిందిగా చెప్పారు. అప్పుడు ఆకాశరాజు శ్రీనివాసునికి నమస్కరించి 'ఓ శ్రీనివాసా! శ్రీమన్నారాయణా! నిన్ను అల్లునిగా పొందుతున్న నా భాగ్యము ఎంతని చెప్పుదును? ఎవరి నామస్మరణచే కోటి జన్మల మహాపాపములన్నీ నశించునో, ఎవరి నామస్మరణకే మనస్సు శరీరమూ శుద్ధి చెందునో, ఎవరి నామస్మరణ వలన కోటి యాగ ఫలం లభించునో, ఎవరి నామస్మరణ వలన సమస్త దేవగణమూ వారి వారి శక్తులు పొందుతున్నారో, ఎవరి దర్శన భాగ్యమై సమస్త మునిగణమూ కోట్లాది సంవత్సరాలుగా తపస్సు చేస్తున్నారో అటువంటి పరబ్రహ్మమూర్తివైన నీవు నాకు అల్లునిగా లభ్యమగుట నా అదృష్టమెంతటిదని చెప్పుదును? నీ పాదపద్మమును ఒక్కసారి మనస్సులో తలిస్తే చాలు సర్వపాపములూ తొలగిపోవును. సర్వభాగ్యాలూ కలుగును. సాక్షాత్తూ బ్రహ్మదేవుడే కడిగిన నీ పాదాలను కడిగే అదృష్టం నాకు కలిగినందుకు నాకెంతో సంతోషముగా యున్నది. కన్యాదాతలందరూ తమ కుమార్తెకు భర్తగా వచ్చే యువకుడు శ్రీమన్నారాయణుని గుణగణాలను, సౌందర్యాన్ని, తేజస్సును కలిగి ఉండాలని తలుస్తారు. అటువంటిది సాక్షాత్తూ నీవే నాకు అల్లునిగా లభించటంతో ఏ కన్యాదాతకూ కలగని అదృష్టం నాకు కలిగింది. అని ఆనందభాష్పాలు కంటరాగా శ్రీనివాసుని పాద పద్మములను కడిగి, చందన కుంకుమ పుష్పాక్షతలతో పూజించాడు. సుమంగళీమణులు మంగళ హారతీపాటలు పాడుతూ శ్రీనివాసునికి హారతి పట్టారు. ఈ వేడుకనంతా చూస్తున్న వారందరి ఆనందం చెప్పనలవి కానిది.

ఇక పెండ్లికుమార్తె తన మందిరంలో ఎలా ఉన్నదో చూద్దాము.



సాక్షాత్తూ సరస్వతీదేవి, గౌరీదేవి పద్మావతిని అలంకరిస్తున్నారు. అద్భుతమైన బంగారు సరిగంచు పట్టుచీర కట్టి, బంగారు కుచ్చులతో మల్లెమొగ్గలు జడను వేసి, పాపటి బొట్టు, చెంపన ముత్యాల సరాలతో అలంకరించారు. సరస్వతీదేవి కాళ్ళకు పారాణి రాయగా, గౌరీదేవి పద్మావతికి బుగ్గన చుక్కను పెట్టింది. ఇంద్రుని భార్య శచీదేవి పద్మావతికి ఎంతో అందమైన, మెరిసిపోతున్న ఆభరణాలను అలంకరింపజేసింది. అప్సరసలు వచ్చి పద్మావతికి చేతులకు కాళ్ళకు గోరింటాకు పెట్టారు.

ఆహా! ఆ తల్లి సౌందర్యం ఎంతని వర్ణించగలం? శ్రీనివాసుడే మదిలో దోబూచులాడుతుండగా, మధుర మధుర ఆలోచనలతో ఆనందిస్తూ, మళ్ళీ ఇంతలోనే ఓహో! ఇక్కడ ఇంతమంది ఉన్నారు కదా! అని సిగ్గుపడి ముడుచుకుపోతూ ఉన్న శ్రీమహాలక్ష్మిని వర్ణించటం ఎవరితరం? ఆ సృష్టిలోని సౌందర్యమంతా ఆమెదే కదా! ఇంత చక్కటి బంగారు ఆభరణాలు ధరించింది గానీ ఈ సృష్టిలోని బంగారమంతా ఈమె స్వరూపమే కదా ఇన్ని రకాల పుష్పాలను చక్కగా తురుముకున్నది గానీ ఈ పుష్పాలలోని అందమంతా ఈ లతాంగిదే కదా! ఈ సృష్టిలోని ఐశ్వర్యమంతా ఈ తల్లి స్వరూపమే కదా! ఆహా! ఈతల్లిని జగన్మాతను పెండ్లికూతురుగా చూసి అక్కడ ఉన్నవారంతా మురిసిపోతున్నారు.

అప్పుడు సరస్వతి 'ఏమి సఖీ! ఏమిటీ పులకింత! మనస్సులోని మారాజు ఏమంటున్నాడు? ఎప్పుడెప్పుడు పెండ్లిపీటపై తన పక్కన కూర్చొనడానికి వస్తున్నావా అని ఎదురు చూస్తున్నాడా? ఎప్పుడెప్పుడు తన హృదయానికి నిన్ను హత్తుకుంటానా అని ఆత్రుత పడుతున్నాడా? అయినా ఆ హృదయంలో ఉన్నది మళ్ళీ నీవే కదా! ఓ సముద్ర తనయా!

ఆతడు కనకాంబరుడైతే నీవు కనకాంగివి. నీవు ప్రకృతివైతే అతడు పురుషోత్తముడు. అతడు క్షీరసాగరంలో శయనించే వాడైతే నీవు ఆ సాగరుని కుమార్తెవే కదా! మీ ఇద్దరి కళ్యాణం ఈ జగత్తుకే కళ్యాణం గదా!' అన్నది. ఈ మాటలతో పద్మావతి సిగ్గుతో మరింత ముడుచుకున్నది. అప్పుడు గౌరీదేవి 'ఏమి సఖీ! ఈ సిగ్గు దొంతరలు! మీ శ్రీనివాసుడు నిన్ను బిగి కౌగిట బంధించినట్లు ఊహించుకుంటున్నావా? మా నారాయణుడు నీ చెక్కిలిపై ముద్దిడినట్లుగా అనిపిస్తున్నదా! మన్మథుడి తండ్రియైన శ్రీమన్నారాయణుడు నీ అథరాలపై మధురగీతాలు పలికిస్తున్నాడా! ఏవో అటువంటి మధుర ఆలోచనలు కాకపోతే తప్ప నీవింతగా సిగ్గుపడవు!' అని అన్నది.

అప్పుడు పద్మావతి మరింత ముడుచుకుని ఇంతలోనే తేరుకుని 'ఓ ప్రియ సఖులారా! మీరు నన్ను బాగానే ఆట పట్టిస్తున్నారు. అయినా మీరు కాక నన్నింకెవరు చమత్కారమాడగలరు? మనం ముగ్గురము ఒక్కటే కదా! మీ ఇద్దరూ దగ్గరుండి నన్ను అలంకరిస్తుంటే ఇంతకు మించిన ఆనందం ఇంకేముంది?' అని అన్నది. ఈ ముగ్గురమ్మల ముచ్చట్లు చూస్తూ అటూ ఇటూ తిరుగుతున్న పెళ్ళివారు ఎంతో మురిసిపోతున్నారు. ఆహా! మనం ఎంతటి భాగ్యానికి నోచుకున్నామా అని పట్టలేని సంతోషంతో మునిగిపోతున్నారు. ఈ ముగ్గురు అద్భుతమైన సౌందర్యంతో, దివ్య ఆభరణాలతో వెలిగిపోతూ ముగ్గురూ పెండ్లికుమార్తెల వలెనే ఉన్నారు ఆహా! ఏమి అద్భుతమీ దృశ్యం!

ఇక్కడ ఇలా ఉంటే అక్కడ నారాయణుడు ఆనంద డోలికల్లో మునిగి తేలుతున్నాడు. ఎప్పుడెప్పుడు తన ప్రియ సఖి పద్మావతిని చేపడుతానా అని ఆత్రంగా ఎదురు చూస్తున్నాడు. శ్రీమన్నారాయణుని పెండ్లి



కుమారునిగా అలంకరించడం కార్యక్రమం అంతా బ్రహ్మ, పరమేశ్వరులు పర్యవేక్షిస్తున్నారు. అద్భుతమైన బంగారు వస్త్రాలు, శిరస్సుపై మణిఖచిత కిరీటము, అనేక దివ్య ఆభరణాలతో దివ్య తేజస్సుతో ప్రకాశిస్తున్నాడు.

పెండ్లి కొడుకైన శ్రీమన్నారాయణుని మందిరానికి ఇంతలో ఆంజనేయుడు వచ్చేశాడు. స్వామిని పెండ్లికుమారునిలాగా చూసిన హనుమంతుని ఆనందానికి అంతులేదు. శ్రీనివాసునితో 'తండ్రీ! శ్రీమన్నారాయణా! జగన్నాథా! జగద్రక్షకా! నీకివే నా నమస్కారములు. ఇంతకుమునుపు త్రేతాయుగములో నీవు శ్రీరామచంద్రునిగా అవతరించినపుడు నీ వివాహనంతరము నిన్ను కలియుటచే నేను సీతమ్మతల్లితో నీ కళ్యాణమును చూసే భాగ్యానికి నోచుకొనలేదు. ఇప్పుడు నా కోరిక తీరింది తండ్రీ! దివ్యమంగళ మనోహరమూర్తివైన నిన్ను ఈ పెండ్లికుమారుని రూపంలో చూస్తుంటే నాకెంతో సంతోషముగా నున్నది. నీవు మా తల్లి లక్ష్మితో వివాహనంతరము శేషాచలము చేరిన పిమ్మట నేను అక్కడే స్థిరనివాసమేర్పచుకొందును. ఎల్లప్పుడు నిన్నే సేవించుచుందును స్వామీ! ఏమి నా భాగ్యము? శ్రీలక్ష్మీనారాయణుల కళ్యాణము గాంచే అదృష్టము ఎంతటిదో కదా! ఓ స్వామీ! నీకోసం ప్రత్యేకించి ఈ మణిని బహుమానముగా తీసుకువచ్చాను. తమరు ధరించవలసిందిగా నా ప్రార్థన' అన్నాడు.

అప్పుడు శ్రీనివాసుడు హనుమంతునితో 'ఓ ఆంజనేయా! నీవు నా ప్రియ సఖుడవు. నీవు ఇచ్చిన ఈ మణి నాకు అత్యంత ప్రీతికరము. తప్పక ధరించెదను. మరి మీ తల్లి పద్మావతికి ఏం బహుమానం తీసుకువచ్చావు? ఉంగరం ఏమైనా తీసుకురాలేదు గదా!' అన్నాడు. అప్పుడు హనుమంతుడు "స్వామీ! నన్ను ఆట పట్టిస్తున్నావా తండ్రీ! ఈ

హనుమ తన తల్లికి ఏ కానుక తీసుకురాకుండా ఉంటాడా! అని అద్భుతమైన రత్నఖచితమైన బంగారు గాజులు చూపించాడు. 'ఆహా! హనుమ! అద్భుతం! ఈ గాజులు చాలా బాగున్నాయి. ఎలాగైనా బిడ్డకి తల్లిమీదే కదా ఎక్కువ ప్రేమ! నాకు తెచ్చిన మణికంటే ఈ గాజులు ఎంత అద్భుతంగా ఉన్నాయో!' అన్నాడు. 'అదుగో! చూడు తండ్రీ! మళ్ళీ ఆట పట్టిస్తున్నావు. నాకు మీ ఇద్దరూ సమానులే!' అని అన్నాడు. ఆ! ఏదో సరదాకి అలా అన్నానులే! హనుమా! నీవంటే మా ఇద్దరికీ ప్రీతికరం. నీవు నాకు ప్రియ సఖుడవు. నీతో కాక మరెవరితో హాస్యమాడతాను చెప్పు?' అన్నాడు. వీరిరువురి వాత్సల్యం చూసి అక్కడ ఉన్న దేవతలంతా మురిసిపోయారు.

కళ్యాణవేదిక అద్భుతంగా రూపొందించబడింది. రకరకాల పుష్పాలతోనూ, ఎంతో వెలిగిపోతున్న దీపాలతోనూ అలంకరించబడింది. పుష్పాలన్నీ ఒకదానిని మించి మరొకటి అందంగా ఉన్నాయి. మేలైన అరటి స్థంభాలు నాలుగు వైపులా దివ్యంగా అమర్చబడ్డాయి. కళ్యాణవేదికపై పెండ్లికుమారుడు, పెండ్లి కుమార్తెల అలంకారాలలో కూర్చున్న శ్రీ పద్మావతీ, శ్రీనివాసులను చూసిన వారిదే భాగ్యం. అంత ముచ్చటగా ఉన్నారు ఆ దంపతులు. జగన్మాత పద్మావతి, జగన్నాథుడు శ్రీనివాసుడు వధూవరులుగా చూసినవారి జన్మయే అదృష్టం. మహా భాగ్యం, ఆహా! మన కనులముందే ఈ వివాహము జరుగుతున్నది కదా!

మామగారైన ఆకాశరాజు అల్లుడైన శ్రీనివాసునికి కోటి సంఖ్యల సువర్ణనిష్కములను వర దక్షిణగా ఇచ్చెను. నవరత్న కర్ణ భూషణమును, భుజకీర్తులను, మణులు, వజ్ర, వైఢూర్యాలు వంటి అనేక దివ్య ఆభరణాలను శ్రీనివాసునికి బహుమానముగా ఇచ్చెను. ఆకాశరాజు అల్లునికి అర్ఘ్యం



ఇచ్చే దిశగా 'వర ఇద మర్ఘ్యం' (వరుడా! అర్ఘ్యమిదిగో) అంటూ మూడు సార్లు చెప్పుతూ, శ్రీనివాసుని దోసిలియందు అర్ఘ్యమిచ్చాడు. "ఇదం ఆచమనీయం" (ఇవి ఆచమన జలమాలు) అని చెప్తూ ఆకాశరాజు శ్రీనివాసుని చేతులలో మూడుసార్లు నీటిని ఉంచాడు. అప్పుడు శ్రీనివాసుడు 'అమృతోపస్తరణ మసి' అంటూ రెండు సార్లు ఆచమనం చేశాడు.

సాక్షాత్తూ జగన్నాథుడు శ్రీమన్నారాయణుని చేతికి తన అర్ఘ్యం ఇవ్వడమా? ఆకాశరాజు కళ్ళలో ఆనందబాష్పాలు రాలాయి. సోమకాసురుడు వేదాలను దొంగలించగా మత్స్యావతారంలో పైకి తీసుకు వచ్చినది ఈ హస్తమే కదా! ప్రహ్లాద రక్షణార్థ నరసింహావతారంలో హిరణ్య కశిపుని చీల్చి చెండాడిన చేతులు ఇవే కదా పరశురాముని అవతారంలో భూమినంతా బ్రాహ్మణులకు దానమిచ్చిన దివ్యహస్తాలే కదా ఇవి! రామావతారంలో శివుని విల్లు విరిచిన అద్భుత పరాక్రమహస్తాలు ఇవే కదా! జగన్మంగళకరమైన ఈ హస్తద్వయానికి అర్ఘ్యమిచ్చే భాగ్యం కలుగడం నా పూర్వజన్మ పుణ్యఫలం తప్ప మరొకటి కాదు! అని తలచాడు ఆకాశరాజు సమస్త జీవకోటినీ ఎల్లవేళలా కాపాడే శ్రీమన్నారాయణుని అభయహస్తానికి అర్ఘ్యం ఇచ్చే అదృష్టం ఎందరికి కలుగుతుంది?

వివాహ మండపంలో దేవతలూ, యక్షకిన్నెర కింపురుషులూ, అందరూ ఆసీనులయ్యారు. వేదికపై జరుగుతున్న కళ్యాణ కార్యక్రమం అంతా కన్నులు ఇంతవిగా చేసుకుని చూస్తున్నారు. బ్రహ్మ, సరస్వతీదేవి, పరమేశ్వరుడు, గౌరీదేవి, ఇంద్రుడు, శచీదేవి, హనుమంతుడు, వేదికపైనే నుంచుని ఉన్నారు. వారితోపాటే ఆకాశరాజు దంపతులు, వశిష్ఠులవారు, బృహస్పతులవారు కూడా ఉన్నారు. వసిష్ఠ మహర్షులవారు శ్రీనివాసునికి

కంకణ ధారణ గావించగా, శ్రీనివాసుడు పద్మావతికి కంకణధారణ చేసాడు. తన ప్రియ సఖుడు శ్రీనివాసునిచే కంకణధారణచేయించుకునే సమయంలో జగన్మాత ఎంతో సిగ్గుపడుతూ, చిరునవ్వుతో తలవంచుకున్నది. ఆ సిగ్గు దొంతరలలో ఆమె శరీర సువర్ణకాంతులు మరింత ప్రకాశించాయి. ఇక వధూవరుల ప్రవర చెప్పే సమయం వచ్చింది. బృహస్పతులవారు పెండ్లికుమార్తె జగన్మాత ప్రవరను ఈ విధంగా చెప్పారు. 'ఓ శ్రీనివాసా! శ్రీమన్నారాయణా! అత్రి గోత్రోద్భవస్య, సువీర మహారాజు ప్రపౌత్రి, సుధర్మ మహారాజు పౌత్రియు, ఆకాశరాజు పుత్రికయగు సౌభాగ్యవతి పద్మావతిని నీకు సహధర్మచారిణిగా, అర్ధాంగిగా ఆకాశరాజు నీకు కన్యాదానమిచ్చెను' అన్నాడు. అప్పుడు ఆకాశరాజు శ్రీనివాసునికి దివ్య ఆభరణాలు, పట్టు పీతాంబరములను బహుమతిగా ఇచ్చాడు.

ఇక శ్రీనివాసునికి ప్రవర చెప్పే అదృష్టం వశిష్టులవారికి లభించింది. 'ఆహా! జగన్నాథా! శ్రీనివాసా! శ్రీమన్నారాయణా! ఈ సృష్టి మొత్తానికి ఆధారభూతుడవైన నీ గురించి ప్రవర చెప్పే భాగ్యం నాకు కలగడం ఎన్నో జన్మల పుణ్యఫలం. ఎన్నో జన్మల తప:ఫలంచేత జగత్కళ్యాణ చక్రవర్తియైన నీ కళ్యాణంలో పాల్గొని నీ ప్రవర చెప్పే భాగ్యం లభించింది. ఈ సృష్టి మొత్తం నీ స్వరూపమే కదా తండ్రీ! బ్రహ్మ, రుద్రుడు, విఘ్నేశ్వరుడు, కుమారస్వామి, ఇంద్రాది అష్టదిక్పాలకులు, ఆదిత్యాది నవగ్రహములూ, అగస్త్యుడు, విశ్వామిత్రుడు, కశ్యపుడు, ఆదిగా గల సమస్త మునిగణమూ, సమస్త యక్ష, కిన్నర, కింపురుష గణాలూ, చెట్టు చేమలు, కొండలు, సముద్రాలు.. ఇలా సర్వం నీవే! కాలము నీవే, కాలపురుషుడవు నీవే! అటువంటి నీ గురించా నేను ప్రవర చెప్పేది? ఇది నా యందు నీ అనుగ్రహం తప్ప మరొకటి కాదు!' అని ఈ విధంగా ప్రవర చెప్పాడు.



'భరద్వాజ గోత్రోద్భవుడు, యయాతి ప్రపౌత్రుడు, శూరుని పౌత్రుడు, వసుదేవుని పుత్రుడగు శ్రీ వేంకటేశ్వరుడు అత్రిగోత్రోద్భవురాలైన ఆకాశరాజు పుత్రిక పద్మావతిని తన సహధర్మచారిణిగా స్వీకరిస్తున్నాడు' అని ప్రవర చెప్పాడు. వెంటనే మంగళ వాద్యాలు మిన్నంటి మ్రోగాయి. సుమంగళీ మణులు మంగళగీతములు పాడసాగారు. అప్పుడు ధరణీదేవి తన చేతిలో జలము పోయుచుండగా ఆకాశరాజు శ్రీనివాసుని కుడి హస్తముందుంచి కశ్యపాది పురోహితులు వేదమంత్రములు చదువుతుండగా పద్మావతి హస్తమును శ్రీనివాసుని హస్తమునందుంచి కన్యాదానము చేశారు.

అప్పుడు బృహస్పతులవారు, వశిష్టులవారూ జీలకర్ర, బెల్లము, పెండ్లికుమార్తె పద్మావతి చేతినందు, పెండ్లికుమారుడు శ్రీనివాసుని చేతియందు ఉంచినారు. పద్మావతి పశ్చిమ ముఖముగాను, శ్రీనివాసుడు తూర్పుముఖముగాను ఒకరినొకరు ఎదురుగా కూర్చున్నారు. వారిద్దరి మధ్య అందమైన తెరను వేదవేత్తలు పట్టుకుని ఉన్నారు. వేద మంత్రములు దివ్యముగా పఠిస్తున్నారు. మంగళ వాద్యములు చెవులకింపుగా మ్రోగుతున్నాయి. బ్రాహ్మణులు సూర్యసూక్తమును పఠిస్తున్నారు. సుమంగళీ మణులు మంగళ గీతములు పాడుతున్నారు.

సుముహూర్తకాలము రాగానే తెరను తొలగించారు. వధూవరులు శ్రీ లక్ష్మీనారాయణులు చిరునవ్వుతో, ఒకరి భ్రూమధ్యము నొకరు చూసుకున్నారు. జీలకర్ర, బెల్లము శ్రీనివాసుని శిరస్సుపై పద్మావతియు, పద్మావతి శిరస్సుపై శ్రీనివాసుడూ ఉంచారు. అప్పుడు శ్రీనివాసుడు 'కన్యా నిరీక్షణ ముహూర్తస్సుముహూర్తోస్తు ఇతి అనుగృహ్ణంతు' నేను కన్యను చూసిన ముహూర్తమును సుముహూర్తము అగునట్లు అనుగ్రహింతురు

గాక' అని మంత్రం చెప్తూ సభ నుద్దేశించి పలికాడు. అప్పుడు బ్రహ్మ, రుద్రుడు, ఇంద్రుడు మొదలైన దేవతలందరూ కన్యా నిరీక్షణ ముహూర్త: సుముహూర్తోస్తు' (నీవు కన్యను చూచిన ముహూర్తము సుముహూర్తము అగుగాక) అని మంత్రం చదువుతూ వధూవరులు పద్మావతీ శ్రీనివాసులపై అక్షింతలు చల్లారు. వివాహం చూస్తున్న వారందరూ వచ్చి వధూవరులపై అక్షింతలు చల్లారు.

ఈ ముచ్చట మొత్తం చూస్తున్న వారందరికీ మాటల్లో చెప్పలేని ఆనందం కలిగింది. శ్రీలక్ష్మీనారాయణుల వివాహం చూసే అదృష్టం ఎంతమందికి కలుగుతుంది? ఈ జన్మకీ భాగ్యము చాలు! అసలు ఈ మహాభాగ్యం కోసమే ఈ జన్మనెత్తినామేమో! అని తలచారు. శేషాచల వాసులందరూ వారి పూర్వజన్మ పుణ్యఫలం చేతనే ఈ దేశంలో జన్మించడం జరిగిందనీ, అందువలననే శ్రీలక్ష్మీనారాయణుల కళ్యాణం చూసే భాగ్యం కలిగిందనీ తలచి ఎంతో సంతోషించారు.

ఇక శ్రీనివాసుని తల్లి వకుళమాత ఆనందం చెప్పనలవి కానిది. శ్రీమన్నారాయాణుడు ద్వాపరయుగంలో శ్రీకృష్ణునిగా వెలసినపుడు అవతారము చాలించే సమయంలో యశోద శ్రీకృష్ణునితో 'కృష్ణా! తండ్రీ! నీ చిన్ననాటినుంచీ నీ ముచ్చటలన్నింటినీ చూశాను. కానీ నీ కళ్యాణము ఒక్కటి మాత్రం నేను చూడలేకపోయాను. ఇది నాకెంతో వెలితిగా వున్నది' అన్నది. అప్పుడు శ్రీకృష్ణుడు యశోదతో 'తల్లీ! నీవు దు:ఖించవలదు. నేను కలియుగములో శ్రీనివాసునిగా వెలసి శేషాచలం వస్తాను. అప్పుడు నీవు వకుళాదేవిగా జన్మించి నా కొరకు వేచియుంటావు. శ్రీ మహాలక్ష్మి పద్మావతి అంశతో నారాయణపురంలో జన్మిస్తుంది. పద్మావతితో నా



కళ్యాణం పూర్తిగా నీ చేతులమీదుగానే జరుగుతుంది' అని అన్నాడు. ఆ మాట ప్రకారమే నేడు పద్మావతీ, శ్రీనివాసుల కళ్యాణం మొత్తం వకుళమాత కంటి ఎదుటే అద్భుతంగా జరిగింది. ఆహా! ఇన్నాళ్ళకు నా కోరిక తీరింది గదా! అని వకుళమాత ఎంతో సంతోషించింది. కనులవెంట ఆనందభాష్పాలురాగా కనులు తుడుచుకున్నది. నా జన్మ ధన్యమైనది. అని ఎంతో ఆనందించింది.

కళ్యాణవేడుక మొత్తం చూస్తున్న హనుమంతునికి కూడా ఆనంద బాష్పాలు కారాయి. సంతోషంతో కనులు చెమ్మగిల్లాయి. త్రేతాయుగంలో సీతారామచంద్రుల వివాహం చూడలేకపోయిన వెలితి ఇప్పుడు తీరింది కదా అని సంతోషపడ్డాడు. కళ్యాణం జరుగుతున్నంతసేపూ వధూవరులిద్దరూ సీతా రామచంద్రులవలెనే కనిపించారు. ఆహా! నా తల్లి వివాహం చూసే అదృష్టం ఇప్పటికి లభించింది కదా! నా తండ్రి కళ్యాణం గాంచే భాగ్యం ఇప్పటికి కలిగింది గదా! ఎంతో సంతోషించాడు. ఎంతో మురిసిపోయాడు.

శ్రీమన్నారాయణుని ప్రియభక్తులైన గరుత్మంతుడు, ఆదిశేషుడు స్వామివారి కళ్యాణం చూసి పులకించిపోయారు. పెళ్ళికూతురునిగా సాక్షాత్తూ శ్రీమహాలక్ష్మిశోభను చూసి మహదానందపడ్డారు. పెండ్లికుమారునిగా జగన్నాథుని చూసి పులకరించిపోయారు. పధ్నాలుగులోకాల వారికీ ఆ రోజు పండగే. శ్రీలక్ష్మీనారాయణుల కళ్యాణం జగత్కళ్యాణమే కదా! అతిథులలో ఉన్న దేవతలందరూ ఎంతో ఆనందపడ్డారు. సుముహూర్త వేళలో ఆకాశంలో రంగుల హరివిల్లులు వెల్లివిరిసాయి. ప్రకృతి అంతా పులకించింది. నెమళ్ళు పురి విప్పి నాట్యం చేశాయి.

అప్పుడు సరస్వతీ, గౌరీదేవిలు పెండ్లికుమార్తె పద్మావతిని తీసుకువెళ్ళి నూతన వస్త్రములు కట్టించి తిరిగి తీసుకువచ్చి పెండ్లిపీటమై కూర్చొనబెట్టారు. అప్పుడు శ్రీనివాసుడు యోక్త్ర ధారణము (వధువును వరుడు త్రాటితో కట్టడం) నకు ఉపక్రమించాడు. శ్రీనివాసుడు "ఆశాసానా సౌమనసం ప్రజాం సౌభాగ్యం తనుం అగ్నేర నూరతా భూత్వా సన్నహ్యే సుకృతాయ కం" (మంచి మనస్సును, మంచి సంతతిని, సౌభాగ్యమును, మంచి తనువును ధరించి అగ్నిహోత్రమున నాకు సహచారిణివై సత్కార్యములకు సంసిద్ధము కమ్ము' అని మంత్రం చదువుతూ పద్మావతి నడుమున త్రాటిని చుట్టి ముడివేసెను. దీనినే 'పత్నీవ్రతోపనయనము' అని అంటారు. ఆ తరువాత మంగళధారణ శుభ సమయం ఆసన్నమైనది.

శ్రీనివాసుడు మాంగల్యదేవతను ఆహ్వానించి శోధసోపచారములతో మంగళసూత్రములను పూజించెను. అప్పుడు బ్రాహ్మణోత్తముడు ఆ మంగళసూత్రములను సభలోని ముత్తైదువలందరి వద్దకు తీసుకువెళ్ళగా వారు వాటిని స్పృశించి కనులకద్దుకున్నారు. సాక్షాత్తూ శ్రీమన్నారాయణుడు శ్రీ మహాలక్ష్మికి ధరింపచేసే మంగళ సూత్రములను తాకుట తమ అదృష్టముగా వారు భావించిరి. సర్వసౌభాగ్యాలకూ నిలయమైన శ్రీ మహాలక్ష్మీ తల్లి మంగళసూత్రములను ఒక్కసారి స్పృశించినా మహాభాగ్యమే కదా! ఒక్కసారి మనం కూడా మన మనస్సులలో ఆ జగన్మాత మంగళ సూత్రములను కనులకద్దుకొనునట్లుగా భావించి నమస్కరించుదాము.

అప్పుడు సమస్త దేవతా గణమూ, సమస్త యక్ష, కిన్నెర, కింపురుష గణములు ఆనందముతో చూచుచుండగా పెండ్లికుమారుడు శ్రీనివాసుడు "మాంగల్యం తంతునా అనేన మమ జీవన హేతునా కంఠే బధ్నామి సుభగే త్వం జీవ శరదశ్శతం" (నా జీవనమునకు హేతువైన యీ సూత్రము చేత



నేను నీ కంఠమున మాంగల్యమును బద్ధము చేయుచున్నాను. నీవు నూరు సంవత్సరములు జీవించుము) అని మంత్రము చదువుతూ పెండ్లికుమార్తె పద్మావతి మెడలో మాంగళ్యధారణ గావించెను. ఈ అద్భుత దృశ్యమును చూచిన వారందరి ఆనందమునకు అంతు లేకుండెను. దేవతలందరూ ఒకరినొకరు కౌగిలించుకుని ఆనందము పట్టలేకపోతిరి. ఆహా! శ్రీలక్ష్మీనారాయణుల కళ్యాణము లోక కళ్యాణమే కదా! మనమెంతటి అదృష్టవంతులము అని తలచిరి. బ్రహ్మ రుద్రుని కౌగిలించుకొనగా ఇద్దరి కనులవెంట ఆనందభాష్పములు కారెను. తమ ప్రియసఖుడైన శ్రీమన్నారాయణుని వివాహము దగ్గరుండి కనులారా గాంచిన వారి సంతోషమునకు అంతు లేకుండెను. నవ వధువులైన శ్రీలక్ష్మీనారాయణులను చూసి సరస్వతి, పార్వతిదేవిలిద్దరూ ఎంతో సంతోషించారు. ఇక తల్లి వకుళమాత ఆనందం చెప్పనే అక్కర్లేదు.

ఇక తదుపరి అక్షతారోపణ కార్యక్రమము జరిగినది. బృహస్పతులవారు మంత్రములు చదువుతూ అక్షతలు తీసుకుని ముందుగా పెండ్లికుమారుడు శ్రీనివాసుని దోసిలియందు వుంచెను. అటు తరువాత మరలా తీసుకుని మంత్రోచ్చారణ చేయుచూ వధువు శ్రీ పద్మావతీ దోసిలియందు కూడా అక్షతలు పోసి అటుపైన ఆమె దోసిలి శ్రీనివాసుని దోసిలి క్రింద వుండునట్లుగా అమర్చెను. ఆహా! ఎంత అద్భుతముగా నున్నది ఆ దృశ్యము!

అప్పుడు బ్రాహ్మణోత్తములు వేదమంత్రములు చదువుతుండగా శ్రీనివాసుడు ముత్యాలతో కూడిన అక్షతలను వధువు పద్మావతి శిరస్సుపై పోసెను. ఆహా! ఎంత సుందరమీదృశ్యము! అవి అక్షతలా లేక శ్రీమన్నారాయణుడు తన ప్రియసఖి శ్రీ మహాలక్ష్మిపై కురిపిస్తున్న

ప్రేమానురాగాల ప్రవాహమా? అటుతరువాత వధువు వంతు వచ్చెను. ఆకాశరాజు గారాలపట్టి పద్మావతి సిగ్గుదొంతరలు చిందుతూ రాగా దోసిలి తలంబ్రాలు శ్రీమన్నారాయణుని శిరస్సుపై పోసెను. ఈ మనోజ్ఞ సుందర దృశ్యమును చూసినవారందరూ ఆనంద పరవశులైరి.

వశిష్ఠులు, భరద్వాజ, అత్రి, కశ్యపుడు, విశ్వామిత్రుడు, ఆదిగాగల మహర్షులు వుచ్చరిస్తున్న వేదమంత్రములచేతను, సుమంగళీమణులు శ్రావ్యంగా పాడుతున్న కమణీయ కళ్యాణ గీతికలతోడను, అద్భుతమైన మంగళవాయిద్యాలతోడను, దివ్యమైన సన్నాయి, నాదస్వరంతోను ఆ ప్రాంగణమంతా దివ్య శోభ సంతరించుకున్నది. ఆ ఆనందముతో అతిథులందరూ శరీరము మరచి కనులు మూసుకొనుచున్నారు... మళ్లీ వెంటనే అమ్మో ఈ దివ్య కళ్యాణం ఒక్క నిమిషమైనా వదలకుండా చూడాలి కదా! అనుకుంటూ తిరిగి కనులు మరింత పెద్దవిగా చేసుకుని చూస్తున్నారు. అలా కాసేపు చూసేటప్పటికల్లా ఆనందంతో తన్మయత్వం చెంది మరళా కనులు మూసుకుపోతున్నాయి... తిరిగి ఉలిక్కి పడి మరలా కనులు తెరవడము, ఇలా ఉన్నది అక్కడ వారందరి మనోస్థితి.

అప్పుడు బృహస్పతులవారు వరుడు శ్రీనివాసుని కుడిచేతికిని, వధువు పద్మావతి ఎడమచేతికిని రక్షాబంధనము కట్టినారు. "ధ్రువం తే రాజా వరుణో ధ్రువం తే నో బృహస్పతిః ధ్రువంత ఇంద్రశ్చాగ్నిశ్చ రాష్ట్రం ధారయతాం ధ్రువం" అని మంత్రమును చదువుతూ పద్మావతి శ్రీనివాసుల కొంగును ముడి వేశారు. ఈ వివాహంలో అద్భుత విశేషమొకటున్నది. చాలా వివాహ మంత్రాలలో శ్రీలక్ష్మీనారాయణ ప్రీత్యర్థం అని, శ్రీలక్ష్మీనారాయణ రూపశ్య అని వస్తుంటుంది. అంటే వధూవరులను



శ్రీలక్ష్మీనారాయణులుగా భావించే అర్థం వచ్చే మంత్రాలు వుంటాయి. ఇక్కడి వివాహంలో వధూవరులు సాక్షాత్తూ శ్రీలక్ష్మీనారాయణులే కావటం విశేషం. అలాగే కొన్ని వివాహ మంత్రాలలో వచ్చే ఇంద్రుడు, అగ్ని మొదలైన దేవతలందరూ ఈ వివాహంలో ప్రత్యంగా వుండటం మరో విశేషం. ఈ విధంగా శ్రీ పద్మావతి శ్రీనివాసుల వివాహం ఎన్నో విశేషాలతో కూడినదై లోక కళ్యాణమునకు కారణభూతమైనది.

అటు తరువాత వశిష్ఠులవారు వధూవరులచే హోమం గావించారు. బ్రాహ్మణోత్తముల వేదమంత్రములు, మంగళ గీతికలమధ్య వరుడు శ్రీనివాసుని కుడిచేతిలో వధువు కుడిచేతినుంచి పాణిగ్రహణ కార్యక్రమం జరిగినది. శ్రీలక్ష్మీనారాయణుల పాణిగ్రహణమును చూసి దేవతలందరూ సంతోషించిరి. సమస్త విశ్వానికీ రక్షా కవచాలుగా నిలచే శ్రీలక్ష్మీ నారాయణుల హస్తములు పాణిగ్రహణ సమయమందు ఎంతో శోభను సంతరించుకున్నాయి. శ్రీమన్నారాయణుని ఈ హస్తమే కదా సృష్టినంతటికీ అభయమిచ్చే దివ్య హస్తం! శ్రీ మహాలక్ష్మీ తల్లి యొక్క ఈ హస్తమే కదా సృష్టిలోని ఐశ్వర్యమంతతను అనుగ్రహించేది! శ్రీమన్నారాయణుని ఈ హస్తమే కదా రావణాది రాక్షసులను సంహరించినది! శ్రీ జగన్మాత యొక్క ఈ హస్తమే కదా సమస్త సౌభాగ్య ప్రదాయనియై విరాజిల్లేది. ఆహా! శ్రీలక్ష్మీనారాయణుల పాణిగ్రహణము కనులారా వీక్షించుచున్న మనమెంత అదృష్టవంతులమో కదా అని అక్కడున్న వారందరూ తలచిరి.

ఇక తరువాతది సప్తపది కార్యక్రమం. అగ్నిహోత్రమునకు దక్షిణముగా కుడికాలు ముందు పెట్టుచూ పెండ్లికుమారుడు శ్రీనివాసుడు తూర్పునకు నడుచుచూ 'ఏకమిషే విష్ణుస్త్వా అన్వేతు' (ఒక పదమున విష్ణువు

నిన్ను ఇష్టము కొరకు అనుసరించును గాక) అని మొదటి పదమును, 'ద్వే ఊర్జే విష్ణు స్త్వా అన్వేతు' (రెండవ పదమును విష్ణువు ఊర్జము కొరకు నిన్ను అనుసరించును గాక) అని రెండవ పదమును, 'త్రీణి వ్రతాయ విష్ణుస్త్వా అన్వేతు' (మూడవ పదమున వ్రతము కొరకు విష్ణువు నిన్ను అనుసరించును గాక) అని మూడవ పదమును ఇలా... ఏడు పదములను ఆయా మంత్రములను చదువుతూ సప్తపదిని పూర్తి చేసెను. ఈ మంత్రములన్నీ ప్రతీ వివాహములో పెండ్లికుమారుడు పెండ్లికుమార్తెతో విష్ణువు ఆమెను అనుసరిస్తున్నాడనే భావంతో చెప్పబడేవి. ఇక్కడ విశేషమేమంటే పెండ్లికుమార్తె మహాలక్ష్మి వెంట సాక్షాత్తూ శ్రీ మహావిష్ణువే వరునిగా ఏడు అడుగులు వేయటం.

హోమం పూర్తయిన పిమ్మట వధూవరులిద్దరూ అగ్నిహోత్రమునకు ప్రదిక్షణము గావించగా శ్రీనివాసుడు పద్మావతికి ఇంతకుముందు నడుము కట్టిన త్రాటిని మంత్రపూర్వకముగా విప్పి వేసెను. వివాహ కార్యక్రమం పూర్తికాగానే ఆకాశరాజు అతిథులందరికీ అద్భుతమైన విందు భోజనములను ఏర్పాటు చేసెను. వివాహమునకు వచ్చిన వారందరికీ ఆకాశరాజు దంపతులు అనేక బహుమానములనిచ్చిరి.

బ్రహ్మ, రుద్రులిద్దరూ దేవతలందరితో కలసి భోజనము గావించారు. అప్పుడు పరమేశ్వరుడు చతుర్ముఖునితో ఇలా అన్నాడు. 'ఓ బ్రహ్మ దేవా! శ్రీ పద్మావతీ శ్రీనివాసుల వివాహము ఎంత అద్భుతముగా జరిగినది! వీరి కళ్యాణము ఈ జగత్కళ్యాణమే కదా! ఈ కళ్యాణమును ప్రత్యక్షముగా చూసినవారందరూ ధన్యులు. ప్రత్యక్షముగా చూడలేకపోయిననూ ఈ విశేషములన్నీ తెలుసుకున్నవారందరికీ అనేక భాగ్యములు లభింపగలవు. ఈ విశేషములన్నియు చదివిన స్త్రీలందరూ శత సంవత్సరములు



సౌభాగ్యముతో వర్ధిల్లగలరు. వివాహము ఆలస్యమవుతున్న కన్యలకు వెంటనే వివాహము సిద్ధించగలదు. దురదృష్టముచేత భర్తను పోగొట్టుకున్న స్త్రీలు చదివినచో మరు జన్మములన్నింటిలో దీర్ఘసుమంగళీమణులుగా, నూరు సంవత్సరములు భర్త, పిల్లలతో సుఖముగా నుందురు. శ్రీ పద్మావతీ శ్రీనివాసుల పరిణయ విశేషములన్నీ చదివినవారికి సకల శుభములు కలుగును. ప్రత్యేకించి ఈ పద్మావతీ శ్రీనివాసుల పరిణయ విశేషములను శుక్రవారము నాడు చదివిన వారికి మరిన్ని ఫలములు సిద్ధించగలవు. శ్రీ పద్మావతీ, శ్రీనివాసులు వుండబోయే శేషాచలము ముందుముందు ఎంతో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమై విరాజిల్లగలదు. నేను ఆ క్షేత్ర పాలకుడనై యుండెదను" అని చెప్పగా బ్రహ్మతో పాటు విన్న దేవతలందరూ ఎంతో సంతోషించిరి.

ఆనాటి రాత్రి బృహస్పతులవారు వధూవరులిద్దరికి ధ్రువ, అరుంధతీ నక్షత్రములను ఆకాశమున చూపించి నక్షత్ర దర్శనము గావించిరి. శ్రీ పద్మావతీ శ్రీనివాసుల కళ్యాణ వేడుకలు అయిదు రోజులు నయనానంద కరముగా సాగెను. ఆ అయిదు రోజులు విశ్వమంతటికీ కళ్యాణ శోభయే! చివరి రోజున శ్రీ పద్మావతీ శ్రీనివాసుల కళ్యాణానికి వచ్చిన వారందరికీ ఆకాశరాజు ఎన్నో బహుమానాలు ఇచ్చాడు.

దేవతలందరూ ఆకాశరాజు దంపతులవద్దనూ, శ్రీ పద్మావతీ శ్రీనివాసుల వద్దనూ శెలవు తీసుకుని తమ తమ లోకాలకు వెళ్ళిపోయారు. బ్రహ్మ, రుద్రుడు ఆదిగాగల ముఖ్యులు మాత్రము అచ్చటనే వుండిరి. ఇక శ్రీనివాసుడు పద్మావతిని తీసుకుని శేషాచలం బయలుదేరే శుభ సమయమాసన్నమయినది. అప్పుడు ఆకాశరాజు శ్రీనివాసుని కౌగిలించుకుని' నాయనా! శ్రీనివాసా! సాక్షాత్తూ శ్రీమన్నారాయణునివే అయిన నిన్ను అల్లునిగా పొందిన నా భాగ్యం ఏమని చెప్పుదును.

ఆ శ్రీ మహాలక్ష్మియే నా పూర్వ జన్మ ఫలమున నా కుమార్తెగా లభించుట వలననే గదా ఇంతటి భాగ్యము కలిగినది. మీరిరువురి వివాహము చూసిన మా జన్మ ధన్యమైనది. ఇన్నాళ్ళూ అల్లారు ముద్దుగా పెంచుకున్న పద్మావతిని ఇక అత్తవారింటికి పంపుతున్నాను. ఈ సమస్త విశ్వానికి రక్షా కవచములైన నీ చేతులలో పెడుతున్నందుకు నాకే సంశయమూ అవసరం లేదు' అని చెప్పి అల్లునికి ఎన్నో బహుమానములు నొసంగెను. అప్పగింతల పాటల మధ్య పద్మావతిని అల్లునికి, అత్తగారైన వకుళాదేవికి అప్పగించెను.

ఆకాశరాజు దంపతులు కుమార్తె పద్మావతిని సారెతోడ అత్తవారింటికి పంపిరి. నూతన దంపతులు శ్రీనివాసుడు, పద్మావతి అక్కడవున్న వారందరి వద్దనూ శెలవు తీసుకుని తమ పరివారముతోడ శేషాచలమునకు పయనమైనారు. మార్గమధ్యములో అగస్త్యముని ఆశ్రమము కనిపించగా అక్కడ కాసేపు ఆగినారు. అప్పుడు అగస్త్య మునీశ్వరుడు నూతన దంపతులకు ఎదురు వచ్చి అనేక నమస్కారములు చేసి శ్రీ లక్ష్మీ నారాయణులారా 'మీకివే నా నమస్కారములు. మీ రాకవలన నా ఆశ్రమం పావనమైనది' అని వారిని ఆహ్వానించి ఎన్నో అతిథి మర్యాదలు గావించి ఆ దంపతులకు అనేక సుమధుర ఫలములను కానుకగా నిచ్చెను. ఆ ఫలములలో కొన్నిటిని ఆ దంపతులు ఆరగించిరి. అప్పుడు శ్రీనివాసుడు అగస్త్యునితో 'ఓ మహర్షీ! నీ అతిథి మర్యాదలు నాకెంతో సంతోషము కలిగించినవి, కొత్త దంపతులు ఆరు మాసములపాటు కొండ నెక్కరాదన్న నియమమున్నందువలన ఈ ఆరుమాసముల కాలము నీ ఆశ్రమమునందే నివసింప నిశ్చయించితిని' అని అన్నాడు.



అప్పుడు అగస్త్యులవారు శ్రీనివాసునితో 'ఆహా! జగన్నాథా! జగద్రక్షకా! ఇంతకు మించిన భాగ్యమేమున్నది? మీ కొరకై చక్కటి పర్ణశాల నిర్మించెదను. మీరు నా ఆశ్రమమునందే ఈ ఆరుమాసములు సంతోషముతో గడుపవచ్చును'. అని శిష్యులను పిలిపించి ఈ పని వారికి అప్పచెప్పెను. వెంటనే అగస్త్యులవారి శిష్యులందరూ కలసి ఆశ్రమంలో ప్రకృతి ఎంతో అద్భుతముగా నున్న ప్రదేశాన్ని ఎంచుకుని పూతోటలమధ్య చక్కని పర్ణశాలను నిర్మించారు.

బృహస్పతులవారు వేదమంత్రములు చదువుతుండగా ఆశ్రమములోని మునీశ్వరులందరూ ఆశీర్వచనములు పలుకుతుండగా నూతన దంపతులైన శ్రీ పద్మావతీ శ్రీనివాసులు గృహప్రవేశము గావించిరి. అక్కడి ప్రకృతి అందాలకు శ్రీనివాసుడు, పద్మావతిల హృదయము పులకించెను. పక్షుల కూకూరావాలు, సుమనోహర పూలమొక్కలు, చక్కని సెలయేళ్ళ మధ్య ఈ పర్ణశాల వాతావరణం ఆ దంపతులకెంతో ఆనందం కలిగించింది. పద్మావతి, శ్రీనివాసులు నివసించిన ఈ ప్రదేశమే నేటి 'శ్రీనివాస మంగాపురం'.

ఆరు నెలల పాటు అక్కడ నివసించిన తరువాత శ్రీనివసుడు, పద్మావతి అగస్త్య మునీశ్వరుల వద్ద శెలవు తీసుకుని శేషాచలమునకు బయలు దేరిరి. అప్పుడు శ్రీనివాసుడు పద్మావతితో 'ఓ సఖీ! శేషాచలముపై కరివేపాకు లభింపజాలదు, కావున అది మనవెంట తీసుకువెళ్ళవలెను' అని చెప్పగా పద్మావతి అటులే చేసెను. బంధుమిత్ర సపరివారముగా శేషాచలము చేరిన తరువాత బ్రహ్మ, రుద్రుడు ఆదిగాగల దేవతలందరూ పుష్పములు చల్లుతుండగా శ్రీనివాసుడు హృదయలక్ష్మీ సమేతుడై ఆనంద నిలయములో ప్రవేశించెను. పద్మావతి హృదయలక్ష్మియై శ్రీనివాసుని యెదనలరించినది.

ఆకాశమునుండి దేవతలు పూలవాన కురిపించిరి. దేవదుందుభిలు మ్రోగెను. శ్రీనివాసుని ఆనందనిలయ ప్రవేశాన్ని పురస్కరించుకుని బ్రహ్మ ఉత్సవమును తలపెట్టి పదిరోజులపాటు దివ్యముగా జరిపించెను. అవే బ్రహ్మోత్సవములుగా నేటికీ దివ్యముగా జరుపబడుచున్నవి. శ్రీ పద్మావతీ శ్రీనివాసుల కళ్యాణ విశేషములు విన్నవారి, చదివి తెలుసుకున్నవారి జన్మ ధన్యము. వీరందరికీ ఆ దివ్య దంపతుల అనుగ్రహము తప్పక కలుగుతుంది. శ్రీ లక్ష్మీ శ్రీనివాసుల దివ్య కళ్యాణ విశేషములు తెలుసుకున్న వారి జీవితమంతయూ ఎటువంటి సమస్యలూ లేకుండా కళ్యాణ ప్రదముగా జరుగుతుంది.

శ్రీలక్ష్మీ శ్రీనివాస కటాక్ష సిద్ధిరస్తు
సమస్త సన్మంగళాని భవన్తు
లోకాసమస్తా సర్వేజనా సుఖినోభవంతు

శ్రియః కాంతాయ కళ్యాణ నిధయే నిధయేర్తినామ్
శ్రీ వేంకట నివాసాయ శ్రీనివాసాయ మంగళమ్.



